RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 ‖ సంచిక : 190 ‖ ఆదిలాబాద్ ‖ గురువారం, డిసెంబర్ 19, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12


### పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ ల పంపిణీ

హుజూరాబాద్, డిసెంబర్ 18(ఏ.ఎం.ఎన్): హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు 10వ తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడులను బుధవారం పంపిణీ చేశారు. పట్టణ శివారులో గల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలురు సంక్షేమ గురుకుల పాఠశాలలో 70 మంది విద్యార్థులకు, కేసీ క్యాంపులోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 70 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడులను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ అందించారు.

### చలితో వణుకుతున్న పాలమూరు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18(ఏ.ఎం.ఎన్): మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజలు చలితో వణికిపోతున్నారు. బుధవారం జిల్లాలో అత్యల్పంగా 9. 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుమూల గ్రామాలను దట్టమైన పొగ మంచు కప్పేయడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఈ సీజన్ లో జిల్లా పరిధిలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతలు ఇవేనని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇదే తరహా పరిస్థితులు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

# ఓవర్‌సీస్ స్కాలర్ షిప్పు పథకాన్ని పట్టించుకోండి

- పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయండి
- అసెంబ్లీలో బీఆర్ ఎస్ డిమాండ్
- మీ కంటే మెరుగ్గా ఆ పథకాన్ని అమలు చేస్తాం
- ఆ స్కీమ్‌ను ఎత్తేసే ఆలోచనే లేదు
- మంత్రి సీతక్క హామీ





హైదరాబాద్ : డ్రంకన్ అండ్ డ్రైవ్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంగ్రెస్ సభ్యుడు బీర్ల ఐలయ్య మధ్య వాగ్వాదం వారిద్దరి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్

విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఓవర్‌సీస్ స్కాలర్ షిప్ పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవటం వల్ల ఆయా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శాసనసభలో బీఆర్ ఎస్ సభ్యుడు కేపీ వివేకానంద ఆవేదన వ్యక్తం చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.104 కోట్లు బకాయి ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల నాలుగో రోజైన బుధవారం ఉదయం 10 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఆ వెంటనే ఆయన ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల అంశంపై పలు ప్రశ్నలు వేశారు. విదేశాల్లోని తెలంగాణ విద్యార్థులకు రెండో వాయిదా, మూడో వాయిదా కింద నిధులను విడుదల చేయకపోవటంతో వారు తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెడుతూ ఇక్కడి ప్రజా ప్రతినిధులకు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. మరోవైపు 2024-25లో ప్రభుత్వానికి ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలపాలని అడిగారు. ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్పుల పథకంలో అధికార పార్టీకి చెందిన వారు పది శాతం కమిషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. వివేకానంద లేవనెత్తిన అంశాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమాధానమిస్తూ...గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఓవర్సీస్ స్కాలర్ షిప్పు పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.244 కోట్లలో, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.140 కోట్లను విడుదల చేశామని వెల్లడించారు. వచ్చే మార్చి నాటికి గడువున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న మిగతా బిల్లులన్నింటినీ అప్పటిలోగా క్లియర్ చేస్తామని వివరించారు. అంతేతప్ప ఓవర్సీస్ స్కాలర్ షిప్పు పథకాన్ని తొలగించే, ఆపే ఆలోచనే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ దశలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆ పార్టీకి చెందిన సీనియర్ శాసనసభ్యుడు వివేకానంద ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్పుల విషయంలో అధికార పక్షానికి చెందిన వారు పది శాతం కమిషన్లు తీసుకున్నారంటూ ఆయన ఆరోపించారనీ, సంబంధిత వ్యాఖ్యలను వివేకానంద ఉపసంహరించుకోవాలని కోరారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కొద్దిగా ఆలస్యమైనా ప్రతీ ఒక్కటీ అమలు చేసి తీరతామని హామీనిచ్చారు. ఈ సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కలుగజేసుకుని, ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలంటూ వివేకానందకు సూచించారు. అయినా ఆయన వెనక్కి తగ్గకపోవటంతో సభలో గందరగోళం చోటు చేసుకుంది. అనంతరం స్పీకర్... వివేకానంద చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. సభా సమయాన్ని వృధా చేయొద్దంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులకు ఏం నేర్పిస్తున్నారంటూ ప్రశ్నించారు. ఆయనతో వాగ్వాదానికి దిగిన బీఆర్ ఎస్ సభ్యులపై స్పీకర్ తీవ్ర అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సభ నుంచి సస్పెండ్ చేస్తానంటూ ఆ పార్టీకి చెందిన పాడి కౌశిక్‌రెడ్డిని సభాపతి హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ సభ్యుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వివేకానంద తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ ఎస్ హయాంలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, బర్రెలు, గొర్రెలు, చేపల పంపిణీ పథకాల్లో విపరీతంగా కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఓవర్ సీస్ స్కాలర్‌షిప్పుల అంశంపైన్నే బీఆర్ ఎస్ సభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి పలు అంశాలను లేవనెత్తారు. ఇందుకు సంబంధించి నిధుల విడుదలలో విపరీతమైన జాప్యం చోటు చేసుకుంటోందని ఆయన వాపోయారు. ఇదే విషయమై బీఆర్ ఎస్ సభ్యుడు అనిల్ కుమార్ జాదవ్, ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల కూడా మాట్లాడారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానాలిస్తూ... బీఆర్ ఎస్ హయాంలో అస్తవ్యస్థమైన ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ఒక్కో పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పదేండ్ల బీఆర్ ఎస్ పాలనలో ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ఏం చేశారో చెప్పాలంటూ ప్రశ్నించారు. అంబేద్కర్ ఓవర్‌సీస్ స్కాలర్ షిప్పుల పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ డిసెంబరులోగా పరిశీలించి, పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ పథకాన్ని గతం కంటే మెరుగ్గా అమలు చేస్తామని భరోసానిచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, కరీంనగర్ జాతీయ రఃహదారికి సంబంధించిన పలు అంశాలను కాంగ్రెస్ సభ్యుడు మదన్ మోహన్‌రావు సభ దృష్టికి తెచ్చారు. జియోగ్రాఫికల్ డిజైల్ లేకపోవటం వల్ల అనేక సంవత్సరాలుగా విపరీతమైన రోడ్డు ప్రమాదాలు ఆ రహదారిపై సంభవిస్తున్నాయని తెలిపారు. అనేక మంది మరణించారని చెప్పారు. ఇలాంటి అనేక విషయాలను సభలో చర్చిద్దామంటే ఆ అవకాశమే రాకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ శాసనసభ్యులు సైతం సభా సమయాన్ని వృధా చేయటం సరికాదని అన్నారు. ప్రజల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వారి కోసం సభలో మాట్లాడకుండా, సమస్యలపై చర్చించకుండా అరుపులు, కేకలతో సభను గందరగోళపరుస్తున్నారంటూ ఆక్షేపించారు. కరీంనగర్ జాతీయ రహదారి చాలా ప్రమాదకరంగా మారిందంటూ బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా మార్చాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. బీఆర్ ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... కరీంనగర్ జాతీయ రహదారికి సంబంధించి తమ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినప్పటికీ, అలైన్‌మెంట్ కేంద్రం ఆమోదముద్ర వేయలేదని గుర్తు చేశారు. అందువల్లే దానికి డీపీఆర్ సమర్పించలేకపోయామని వివరించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానమిస్తూ... గత ప్రభుత్వం సకాలంలో స్పందించి, డీపీఆర్ సమర్పించి ఉంటే కరీంనగర్ జాతీయ రహదారి పూర్తై ఉండేదని వ్యాఖ్యానించారు. బీఆర్ ఎస్ హయాంలో ప్రతీ జిల్లాలోనూ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక ప్రణాళికాబద్ధంగా రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి పూనుకుందని అన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు ఏడు కిలోమీటర్ల వరకూ ఉన్న రోడ్లు పరిస్థితి అధ్వాన్నంగా మారిందని చెప్పారు. ఓ.ఆర్.ఆర్.ను నిర్మించటం ద్వారా గతంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపిందని తెలిపారు. వచ్చే నాలుగేండ్లలో రీజనల్ రింగ్ రోడ్డను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ ఎస్ హయాంలో డబ్బులు, కమిషన్లు వచ్చే కాళేశ్వరంపై దృష్టి పెట్టారు తప్పితే ప్రజలకు అవసరమైన రహదారుల నిర్మాణంపై దృష్టి సారించలేదని ఆ పార్టీ సభ్యుడు హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఇచ్చిన సమాధానంపై బీఆర్ ఎస్ సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ... హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకూ ఉన్న రహదారికి బీఆర్ ఎస్ హయాంలోనే భూ సేకరణ చేశామని గుర్తు చేశారు. ఇందుకు రూ.1,300 క్లో వెచ్చించామని తెలిపారు. మంత్రి తనపై చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ దశలో జోక్యం చేసుకున్న సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు... సభా సంప్రదాయాలను అందరూ పాటించాల్సిందేనని సూచించారు. అనుచిత వ్యాఖ్యలు ఎవరు చేసినా వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమయంలో బీఆర్ ఎస్ సభ్యుడు హరీశ్‌రావు... డ్రంకన్ డ్రైవ్ గురించి చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు, కాంగ్రెస్ సభ్యుడు బీర్ల ఐలయ్య మధ్య వాగ్యుద్ధం నడిచింది. అనంతరం వారిద్దరి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభాపతి సూచనతో శాలరీలు, పెన్షన్లు, భూ భారతికి సంబంధించిన బిల్లులను మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రతిపాదించారు.



రాష్ట్రంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ర్యాలీగా అసెంబ్లీకి బయలుదేరిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు

## అంబేడ్కర్ ను అవమానించిన అమిత్ షా మనువాద వ్యాఖ్యలను ఖండించండి

- అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి
- 19న అమిత్ షా దిష్టిబొమ్మల దగ్ధం
- కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు

హైదరాబాద్ :కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొన్నది ఈ మేరకు కేవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. .వారు మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ పట్ల ఆర్ ఎస్ ఎస్ బీజేపీ కి ఉన్న అవగాహనను వ్యక్తం చేశారని అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారని అన్నారు దుర్మార్గమైన దారుణమైన అహంకార చర్యను అందరూ ఖండించాలన్నారు .ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలపడం హర్షణీయమన్నారు.

ఈ మతోన్మాద చర్యను కెవిపియస్ ఖండిస్తుందన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నిసార్లు అంబేద్కర్ అని పదే పదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు 7 జన్మలకు స్వర్గం దక్కుతుందనడం సిగ్గు చేటన్నారు. అలా అనటమే కాకుండా మాటి మాటికీ అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఏగతాళిగా మాట్లాడటం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారం లోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటన్నారు . నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగం పై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి జరుగుతుందన్నారు .

ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవలిసిన అవసరం ఉ ందన్నారు.డిసెంబర్ 19న రాష్ట్ర వ్యాప్తంగా అమిత్ షా దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని కేవీపీఎస్ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు.

## భూభారతి.. బిల్లులోని ప్రధానాంశాలు

హైదరాబాద్ : 2020 ఆర్వోఆర్ చట్టం (ధరణి) లోని తప్పులను కొత్త చట్టం భూ-భారతి సరిదిద్దుతుంది.

రాష్ట్రంలో భూముల సమస్యలకు కొత్త చట్టం శాశ్వత పరిష్కారం చూపిస్తుంది. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. కొత్త చట్టం రూపకల్పనకు 18 రాష్ట్రాల్లో ఉన్న ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసింది. చట్టం ముసాయిదాను కూడా ప్రకటించి ప్రజల నుంచి సలహాలు, సూచనలను కూడా స్వీకరించింది. పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో పైలెట్ ప్రాజెక్టును నిర్వహించింది. విస్తృత స్థాయిలో చర్చలు జరిపి మేథోమధనం చేసి ఈ చట్టాన్ని రూపొందించింది. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి తో వివాదస్పదమైన 18 లక్షల ఎకరాల భూములను పార్టు (బీ) పేరుతో పరిష్కరించకుండా పెండింగ్ లో పెట్టారు. ఈ భూ భారతి చట్టం వీటికి పరిష్కారం చూపిస్తుంది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాదీ/గ్రామ కంఠం సమస్యలను ఈ చట్టం పరిష్కరిస్తుంది. భవిష్యత్తులో భూవివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించి శాశ్వతంగా పరిష్కరించే విధానం. ధరణిలో రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ లేదు. ఎవరికి ఫిర్యాదు చేసుకోవాలో తెలియని పరిస్థితి. ఇప్పుడు కొత్త చట్టం అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తుంది . వారసత్వం, వంశపారంపర్య భూములు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేసారి చేయటంతో కుటుంబసభ్యుల నుంచి వచ్చే ఫిర్యాదులు పెరిగిపోయాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొత్త చట్టం ప్రకారం మ్యుటేషన్ చేసేటప్పుడు ఆ కుటుంబంలోని ఇతర సభ్యులకు నోటీసులు ఇచ్చి వారి అభిప్రాయాలను తీసుకొని మ్యుటేషన్ చేయటం జరుగుతుంది. సేల్ డీడ్, వారసత్వం కాకుండా కోర్టు తీర్పుల ద్వారా వచ్చే ఓఆర్సీ, 38-ఈ తదితర 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ పవర్స్ కొత్త చట్టంలో ఆర్డీవోకు అప్పగించారు.

గత ప్రభుత్వం సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించకుండా పెండింగ్ లో పెట్టింది. ధరణి అమలుకు ముందు, తర్వాత కూడా సాదా బైనామా దరఖాస్తులు స్వీకరించింది. కానీ.. దీనికి సంబంధించిన పరిష్కారాన్ని చూపించలేదు. భూభారతి చట్టం 2020 నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 9.24 లక్షల సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారం చూపిస్తుంది.

దేశంలో ప్రతీ పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో మన రాష్ట్రంలో భూములకూ భూధార్ నంబర్ కేటాయిస్తారు. త్వరలోనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తారు. గత ప్రభుత్వం రెవిన్యూ వ్యవస్థను భష్టు పట్టించింది. గ్రామీణ ప్రాంతాల్లో రెవిన్యూ వ్యవహారాలు చూసే వ్యవస్థ లేకుండా చేసింది.

2014కు ముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ, జమాబందీ ఎలా ఉందో.. ఇప్పుడు కూడా అదే విధంగా కొనసాగుతుంది.

భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ళ కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తారు. అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి వీటి సంఖ్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్ ను ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపరిచింది. ప్రభుత్వ ఆస్తుల్ని ఉ ద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని శిక్షించేలా ఈ చట్టంలో నిబంధనలున్నాయి.

2014 కి ముందు పాస్ బుక్కులుండీ, అనుభవదారుడిగా పొసిషన్ లో ఉన్న వారు ధరణి తరువాత రోడ్డున పడ్డారు. ఈ భూ భారతిలో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఈ చట్టంలో వీరికి సముచిత స్థానం కల్పించారు. రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తారుభూ-భారతి ప్రత్యేకతలు ధరణిలో ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యుల్ ఉ ండేది. మొత్తం 33 మాడ్యూళ్లు (ఆప్షన్స్) ఉండేవి. ఏ మాడ్యుల్ ఏ సమస్యకు ఎంచుకోవాలో రైతులకు అర్థమయ్యేది కాదు. ఇప్పుడు దాన్ని సులభతరం చేసి ప్రభుత్వం కేవలం ఆరు మాడ్యూళ్ళకు కుదిస్తుంది. గతంలో మాన్యువల్‌గా పహణీలో 32 కాలమ్‌లు ఉండేవి. వాటిని ధరణిలో ఒకే కాలమ్‌కు గత ప్రభుత్వం కుదించింది. ఇప్పుడు దాన్ని 11 కాలమ్‌లు చేస్తున్నాం.ధరణిలో భూ యజమానికి తన భూమి రికార్డుల వివరాలన్నీ కనిపించేవి కాదు. కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా అప్పటి ప్రభుత్వ లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతి ఎవరైనా ఎక్కడి నుంచైనా తమ భూమి వివరాలు చూసుకునేలా డిస్‌ప్లే చేస్తుంది.ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ఎవరైనా భూ భారతి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేయవచ్చు. ఆ భూముల్ని పరిరక్షించేందుకు ఈ చట్టం ప్రాధాన్యమిస్తుంది. భూ-భారతిలో దరఖాస్తు చేసుకున్న భూ యజమానులకు దరఖాస్తు పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా వారి మొబైల్ నెంబర్ కు అప్ డేట్ సమాచారం చేరవేస్తుంది.



ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## కేంద్ర నుంచి చట్ట ప్రకారం రావాల్సిన నిధులు తెస్తున్నాం

### : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా నేను, మా సహచర మంత్రులు ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులను కలిసి సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తూ చట్ట ప్రకారం మాకు రావాల్సిన నిధుల వాటా ఇంత ఉంది ఆ మేరకు నిధులు ఇవ్వాలని కోరుతున్నాం ఆ మేరకు నిధులు తీసుకొస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధ వారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వివిధ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలపై ప్రశ్నించగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం పది ఏళ్లలో సాధించిన దాని కంటే మా ప్రభుత్వం కేంద్రం నుంచి అధికంగా నిధులు



సాధించిందని డిప్యూటీ సీఎం వివరించారు. గత పది సంవత్సరాలుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు, గత ఏడాది కాలంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలతో తాను సభకు వచ్చానని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి నేరుగా నిధులు కేటాయించదు, ఆ ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రత్యేక పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని వివరించారు. మా ప్రభుత్వం ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉంటుంది, మేము ఏ వివరాలను దాచుకునే వాళ్ళం కాదని అన్నారు. కేంద్రం జీఎస్టీ బిల్లును తీసుకురాగా గత ప్రభుత్వం మద్దతునిచ్చిందని.. ఆ తర్వాత వారు బిజెపితో వైరం పెట్టుకున్నారని అన్నారు.

# సంపాదకీయం

## సిరియా పునరుద్ధరణ ఎలా?

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన అసద్ కుటుంబ పాలన సిరియాలో ముగిసింది. అరబ్ సోషలిస్టు బాత్ పార్టీ నేత, అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలన 2000 జులై 17 నుంచి 2024 డిసెంబరు 8 వరకు సాగింది. అంతకు ముందు బషర్ తండ్రి హఫీస్ అల్ అసద్ 1971 మార్చి 14 నుంచి 2000 జూన్ పది (మరణించే) వరకు అధికారంలో ఉన్నాడు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పూర్వపు సోవియట్ యూనియన్, తరువాత రష్యా పాలకులు సిరియాకు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. నవంబరు చివరి వారం నుంచి హయత్ తహ్రిరిర్ అల్ షామ్ (హెచ్.టి.ఎస్) సాయుధ సంస్థ, దానికి మద్దతు ఇచ్చిన వారు కలసి అసద్ మిలిటరీపై పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించి డిసెంబరు ఎనిమిదవ తేదీన రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవటం, అసద్ కుటుంబం రష్యాకు ప్రవాసం వెళ్లటంతో సిరియాలో నూతన అధ్యాయం మొదలైంది. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమై పద్నాలుగు నెలలు గడిచాయి. పాలస్తీనియన్లకు మద్దతుగా ఉన్న లెబనాన్‌లోని హిజ్బుల్లా సాయుధ సంస్థతో ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న తరువాత సిరియా పరిణామాలు జరిగాయి. 2011లో ప్రారంభమైన అంతర్యుద్ధంతో సిరియన్లు అనేక విధాలుగా దెబ్బతిన్నారు, దేశం సర్వనాశనమైంది. కుక్కలు చింపిన విస్తరిలా సాయుధ ముఠాలు కొన్ని ప్రాంతాలను తమ అదుపులో ఉంచుకున్నాయి. ఆరు లక్షల మంది వరకు పౌరులు, సాయుధులు, సైనికులు మరణించినట్లు అంచనా. 70 లక్షల మంది అంతర్గతంగా నెలవులు తప్పగా మరో 70 లక్షల మంది వరకు ఇరుగు పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. అంతర్యుద్ధం ముగిసినా సాధారణ జీవన పరిస్థితి ఎంత కాలానికి పునరుద్ధరణ అవుతుందన్నది పెద్ద ప్రశ్న. ఇప్పుడు సిరియా భవితవ్యం ఏమిటంటే ఎవరూ ఏమీ చెప్పలేని స్థితి. అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా దశాబ్దాలపాటు జోక్యం చేసుకున్న రష్యా రానున్న రోజుల్లో ఎలాంటి పాత్ర పోషించేదీ తెలియదు. నూతన పాలకులు టర్కీ కనుసన్నలలో పని చేసే అవకాశం ఉంది. నాటోలో అది అమెరికా అనుయాయి. అదే సమయంలో కొన్ని అంశాలలో దానితో విబేధించి రష్యాతో సంబంధాలు కలిగి ఉంది. సిరియా పరిణామాల్లో రష్యా, అమెరికా రెండూ తమ ప్రభావాన్ని చూపేందుకు ప్రయత్నించాయి. దాన్ని అదుపులోకి తెచ్చుకొనేందుకు అమెరికా పెద్ద ఎత్తున తిరుగుబాటుదార్లను ప్రోత్సహించింది. ఇటీవల జరిగిన పరిణామాలను చూసినపుడు సిరియాలో ఇంక అమెరికా చేసేది ఏముందని కొందరు నిరుత్సాహాన్ని ప్రకటించారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన 1990 దశకం తరువాత "ఆపరేషన్ టింబర్ సైకామోర్" పేరుతో అమెరికా భారీ మొత్తాలను సిరియాలో కుమ్మరించిందని చెబుతున్నారు. ఉదారవాద తిరుగుబాటుదార్ల ముసుగులో 2013 నుంచి 2017 వరకు నాలుగు సంవత్సరాలలో అమెరికా సిఐఏ ద్వారా వివిధ సంస్థలకు వంద కోట్ల డాలర్లకు పైగా అందచేసిందని అంచనా. ఆ తరువాత కూడా తరతమ తేడాలతో ఇదే విధంగా తిరుగుబాటుదార్లకు చేరుస్తున్నది. అసద్ వ్యతిరేకులకు మద్దతుతో పాటు సిరియాలో అమెరికాను కూడా వ్యతిరేకించే శక్తులను దెబ్బతీసేందుకు చూసింది. అమెరికా మిలిటరీ కూడా 50 కోట్ల డాలర్లతో తిరుగుబాటుదార్లకు శిక్షణ, ఆయుధాలను అందచేసింది. ఇవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. టర్కీ మద్దతు ఉన్న తిరుగుబాటుదార్లు డమాస్కస్‌ను పట్టుకుంటారని కూడా అమెరికా ఊహించినట్లు కనపడదు. లేదా నిస్సహాయంగా ఉండిపోయిందని చెప్పవచ్చు. అందుకే ట్రంప్ అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా మాట్లాడుతున్నాడు. ఒబామా గనుక కాస్త ముందుగా జాగ్రత్తపడి ఉంటే అసద్ తొలగింపు మరింత వేగిరం, అమెరికా ప్రమేయం కూడా ఉండేదని రణోన్మాదులు కొందరు నిష్టూరాలాడుతున్నారు. అమెరికా మద్దతు ఇచ్చిన మిలిటెంట్ సంస్థలన్నీ అంతర్గత కుమ్ములాటలు, అవినీతి, గూండాయిజాలతో కొట్టుకు చచ్చాయని, అల్‌ఖైదాకు ఆయుధాలు అమ్ముకున్నట్లు విమర్శిస్తున్నారు. ఈ శక్తులు అసద్ మీద ఒత్తిడి తెచ్చి అంతర్జాతీయ సమాజంతో చర్చలకు నెడతాయని అమెరికా ఊహించినదానికి భిన్నంగా అసద్ బలమైన శక్తితో అనేక నగరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిరియాలో మాజీ అమెరికా రాయబారి రాబర్ట్ పోర్డ్ చెప్పాడు. అమెరికా నుంచి నిధులు పొందిన ఫ్రీ సిరియన్ ఆర్మీ వంటి సంస్థలు చివరకు టర్కీ అనుకూల సిరియన్ నేషనల్ ఆర్మీగా మారిపోయాయని, వారు కుర్దులపై అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడటంతో అదే అమెరికా చివరికి మానవ హక్కులకు భంగం కలిగించారనే పేరుతో ఆంక్షలు విధించిందని, చివరికి నవంబరు చివరి వారంలో ఈ శక్తులు లూటీలకు పాల్పడుతుండటంతో తాజాగా అధికారానికి వచ్చిన హెచ్.టి.ఎస్ దళాలు వారిని అణచివేసి అరెస్టు చేశాయని ఇలాంటి పనులు చేసిన తరువాత అమెరికాకు సిరియాలో ఇంక చేసేందుకు ఏం మిగిలిందని ప్రశ్నిస్తున్నారు. ఈ విమర్శలన్నీ మరింత గట్టిగా వ్యవహరించలేదని, సిరియాను తమ అదుపులోకి తెచ్చుకోలేదని తప్ప పరాయి దేశంలో జోక్యం తప్పనే కోణం నుంచి కాదు. రాబోయే రోజుల్లో ఏం జరిగినప్పటికీ అమెరికా డ్రైవర్ సీట్లో కూర్చొనే అవకాశం లేదని, చేసిన ఖర్చంతా వృధా అయిందని విమర్శిస్తున్నారు. సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి. తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికీ హెచ్.టి.ఎస్‌ను ఉగ్రవాద సంస్థగా దాని నేత జొలానీ ఉగ్రవాదిగా వర్ణిస్తున్న అమెరికా రానున్న రోజుల్లో అతని నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడితే ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న. అతనికీ అదే పరిస్థితి. ఈ సంస్థ రానున్న రోజుల్లో ఇరాన్‌తో చేతులు కలపవచ్చని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనుమానిస్తున్నాడు. అది గనుక తమపై దాడికి దిగితే ప్రతిస్పందన గట్టిగా ఉంటుందని, గత ప్రభుత్వానికి ఏం జరిగిందో దీనికీ అంతే అని హెచ్చరించాడు. నూతన పాలకులతో రష్యా సంబంధాలు పెట్టుకోవచ్చని, ఇరాన్ కూడా అదే చేయవచ్చని కూడా పశ్చిమ దేశాల పరిశీలకులు చెబుతున్నారు. సిరియాలో ఉన్న తమ సైన్యాన్ని వెనక్కు రప్పిస్తానని గతంలో డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. అయితే జనవరి 20న కొలువు తీరనున్న ట్రంప్ సర్కార్‌లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న మార్కో రుబియో మాత్రం వేరుగా స్పందించాడు. రానున్న రోజుల్లో ఉగ్రవాద ముప్పు తలెత్తితే ఎదుర్కొనేందుకు అక్కడ తమ సైన్యం ఉండటం అవసరమని సెలవిచ్చాడు. సిరియాలో ఇప్పటికైతే పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

# భారతీయ గ్రంథాలు కీర్తి సంకేతాలు

"అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంత మైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళ యితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగుతున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషే యాలని భావించే వేదాలు మొదలుకుని, 2300ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జపత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవుతాయి. మనిషి అజ్ఞానంతోనో , తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన ఆరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్టాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రౌతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్థాన త్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపం చంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ



సంస్కృ తిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహుకష్టంతో కూడుకునేది. గురువుకు ప్రాధాన్యత ఉండడం వల్లే గురు: బ్రహ్మ, గురుర్విష్ణు అన్న సూక్తి పుట్టుకొచ్చింది. దానిని ప్రసుతం గ్రంథానికి వర్తింప చేయవచ్చు. గ్రంథాలయం అందుబాటు వల్ల దూరవిద్యా విధానం కూడా అమలు లోనికి వచ్చింది. ముద్రణా యంత్రాల ఆధునీకరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అందమైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడుతున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథం లోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ముద్రణ వల్ల గ్రంథానికి విలువ ఏర్పడింది కనుక, డిమాండును బట్టి, వ్యాపారాత్మకత కారణంగా అధిక ధరల ప్రపంచం ఏర్పడుతున్నది. తొలి హైదరాబాద్ బుక్ ఫెయిర్ 1985లో హైదరాబాద్ లోని అశోక్ నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. అనంతరం నిజాం కాలేజీ గ్రౌండ్స్, పబ్లిక్ గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కేశవ్ మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో బుక్ ఫెయిర్లు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ కళా భారతి (ఎన్టీఆర్ గ్రౌండ్స్)లో పుస్తక ప్రదర్శన నిరంతరం కొనసాగుతోంది. ప్రతి ఏటా హైదరాబాద్? వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే హైదరాబాద్ బుక్?ఫెయిర్ ఈ నెల 19 నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఇందిరాపార్క్? సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 29 వరకు 37వ జాతీయ పుస్తక ప్రదర్శన జరగుతున్నది. పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు, రచయితలకూ, వారు అక్కడే ఉండి పుస్తకాలు అమ్ముకునే సదుపాయం గల ప్రత్యేక స్టాల్, రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8:30 గంటల వరకు, శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే కదా. అందుకే చాలామందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా. దేవున్ని జారతలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనే వారు, చదివే వారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే భాగ్యనగర పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూ తులను మిగులు స్తుంది అనేది నూటికి నూరు పాళ్ళు నిజం.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# బంగ్లా మైనారిటీల భద్రత ఎలా?

బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రత సమస్యను మిస్రి లేవనెత్తినా, ఢాకా బలమైన వాదనలను ముందుంచినట్లు తెలిపారు. ఇది మైనారిటీలపై దాడులు లేదా ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ దాస్ బెయిల్‌పై విడుదల ను అభ్యర్థిస్తున్న న్యాయవాదులను నిర్బంధించడం, చంపడం లేదా కొట్టి చంపడం వంటి అంశాలను 'అంతర్గత' వ్యవహారాలుగా పేర్కొనడం ద్వారా భారత్‌కు సంబంధం లేని విషయం అనే స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఒక విధంగా యూనస్ ముందు మిస్రి నిస్సహాయంగా తిరిగి వచ్చిన్నట్టు అర్థం అవుతుంది. పాకిస్తాన్ అణచివేత నుండి దేశాన్ని విముక్తి చేయడంలో ముక్తి బాహినికి సహాయం చేయడంలో భారత దేశం పాత్ర గురించి మిస్రి స్పష్టంగా లేవనెత్తే ప్రయత్నం కూడా చేసినట్టు కనిపించడం లేదు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత హిందువులపై, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులు మొత్తం భారత్ ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు 1947 నుండి జరుగుతూ ఉన్నప్పటికీ మొదటిసారిగా మొత్తం ప్రపంచంలో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈ విషయమై అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు. యూరోపియన్ యూనియన్ కూడా బంగ్లాదేశ్‌ను దుందుడుకుగా ప్రవర్తించడాన్ని ఖండించింది. చట్ట పాలనను కాపాడాల్సిన అవసరాన్ని, తగిన ప్రక్రియను, ప్రాథమిక హక్కులను గౌరవించాల్సిన అవసరాన్ని యూరోపియన్ యూనియన్ తాత్కాలిక ప్రభుత్వానికి పిలుపునిచ్చింది. డిసెంబర్ 9న ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్‌తో జరిగిన గోష్టిలో బంగ్లాదేశ్‌కు యూరోపియన్ యూనియన్ రాయబారి, ప్రతినిధి బృందం అధిపతి మైఖేల్ మిల్లర్ ఈ పిలుపిచ్చారు. కొద్ది రోజుల క్రితం ఆ దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడులపై యుకె పార్లమెంట్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న క్రూరత్వాన్ని ప్రపంచం ఇప్పుడు తీవ్రంగా ఖండిస్తున్నది. వాస్తవానికి, 1947లో విభజన జరిగినప్పటి నుండి అక్కడ మైనారిటీలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారు. వారి ఆస్తులను దోచుకున్నారు, మహిళలను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, బలవంతంగా భారత దేశానికి పారిపోవాల్సిన పరిస్థితులు సృష్టిస్తున్నారు. 75 సంవత్సరాల నిరంతర హింస తర్వాత మొదటిసారి ప్రపంచం ఆందోళన వ్యక్తం చేస్తుంది. అయితే, ఈ విషయంలో భారత ప్రభుత్వం మాత్రం దిక్కుతోచని స్థితిలో కనిపిస్తున్నది. భారత విదేశాంగ విధానం కుప్పకూలిందా? అనే అనుమానం కలుగుతున్నది. విదేశాంగ మంత్రి పార్లమెంట్ ఉభయసభలలో ఓ ప్రకటన చేయడం మినహా ఈ విషయమై మన ఎంపిలు పార్లమెంట్ వేదికగా ఆగ్రవేశాలను వ్యక్తం చేసే ప్రయత్నం కూడా చేయలేదు. 1971లో దాదాపుగా మొత్తం ప్రపంచం భారత్‌కు వ్యతిరేకంగా నిలబడినా కేవలం నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎంతో సాహసోపేతంగా నాటి తూర్పు పాకిస్తాన్‌లో జరుగుతున్న దారుణమైన అణచివేతలు ఖండించారు. అంతేకాదు ప్రత్యక్ష జోక్యానికి తలపడ్డారు. గత 75 ఏళ్లలో భారత సైనికులు సాంకేతికంగా విజయం సాధించిన ఏకైక యుద్ధం అదే కావడం గమనార్హం. మొత్తం ప్రపంచాన్ని నివ్వెరపరచిన ఆ విజయానికి గుర్తుగా పాక్ సైనికులు భారత సైనికుల ముందు లొంగిపోతున్న చిత్రాన్ని భారత సైన్యం ప్రధాన కార్యాలయం నుండి తొలగించడం ద్వారా నాటి సాహసోపేత నాయకత్వం గురించిన స్మృతులను చెరిపివేసే విచిత్రమైన ప్రయత్నాలను ఇప్పుడు 50 ఏళ్ల తర్వాత చేస్తున్నారు. అయితే, పొరుగు దేశమైన బంగ్లాదేశ్ లో పరిస్థితులు అదుపు తప్పడం మన భద్రతకు సైతం ప్రమాదకారిగా మారుతున్నా భారత్ మౌనం వహిస్తున్నది. షేక్ హసీనా ఆ దేశం విడిచిపెట్టే వరకు అక్కడ జరుగుతున్న పరిణామాల గురించి భారత్ ఏమాత్రం అవగాహన లేకుండా ఉండటం మన దౌత్య, రక్షణ విధానాల ఘోర వైఫల్యాలకు నిదర్శనమే. హసీనా ప్రభుత్వం కూలిన తర్వాత మొదటిసారిగా డిసెంబర్ 9న, భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహిద్ హుస్సేన్, తాత్కాలిక ప్రధాన మంత్రి ముహమ్మద్ యూనస్‌లను కలవడంతో పరిస్థితులపై భారత్ ఆందోళనలను స్పష్టంగా వ్యక్తీకరిస్తారని ఆశించాము. బంగ్లాదేశ్‌తో 'సానుకూల, నిర్మాణాత్మక, పరస్పర ప్రయోజనకరమైన సంబంధం' కోసం భారత్ విధానం పట్ల మిస్రి ఆశావాద స్వరాన్ని వినిపించినప్పటికీ, ఢాకా నుండి తగిన స్పందన కనిపించలేదు. దానితో ఆయన పర్యటన విఫలమిస్తోన్నట్లు స్పష్టం అవుతుంది. భారతదేశంలో హసీనాకు ఆశ్రయం కల్పించడం, తాత్కాలిక ప్రభుత్వం గురించి ఆమె చేసిన విమర్శనాత్మక ప్రకటనలకు సంబంధించిన ఉద్రిక్తతల నీడలో ఆయన జరిపిన చర్చలకు విలువ లేకుండా పోయింది. ఢాకా విమానాశ్రయంలో మాట్లాడుతూ, మిస్రి ఈ చర్చలను నిష్కపటమైన, ఉత్పాదక సంభాషణకు అవకాశంగా అభివర్ణించారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనం కోసం ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడానికి భారత్ నిబద్ధతను నొక్కి చెప్పారు. అయితే, ఢాకా మీడియాలో వచ్చిన కథనాలు ఈ పర్యటన పట్ల ఆసక్తికరంగా లేవు. ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చిన వ్యాసంలో, ఈ అభివృద్ధి (సామూహిక తిరుగుబాటు) ముందు, ఒకటిన్నర దశాబ్దాలకు పైగా, భారత ప్రయోజనాలకు సేవ చేయడం కోసం న్యూఢిల్లీ ఒకే పార్టీపై, ఆచరణాత్మకంగా ఢాకాలో ఒకే జమీందార్ లాంటి దేశాధినేతపై ఆధారపడటం ద్వారా విదేశాంగ విధాన పజిల్‌ను అందించింది' అంటూ భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని ఆ రచయిత తూర్పారబట్టారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రత సమస్యను మిస్రి లేవనెత్తినా, ఢాకా బలమైన వాదనలను ముందుంచినట్లు తెలిపారు. ఇది మైనారిటీలపై దాడులు లేదా ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ దాస్ బెయిల్‌పై విడుదలను అభ్యర్థిస్తున్న న్యాయవాదులను నిర్బంధించడం, చంపడం లేదా కొట్టి చంపడం వంటి అంశాలను 'అంతర్గత' వ్యవహారాలుగా పేర్కొనడం ద్వారా భారత్‌కు సంబంధం లేని విషయం అనే స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఒక విధంగా యూనస్ ముందు మిస్రి నిస్సహాయంగా తిరిగి వచ్చిన్నట్టు అర్థం అవుతుంది. పాకిస్తాన్ అణచివేత నుండి దేశాన్ని విముక్తి చేయడంలో ముక్తి బాహినికి సహాయం చేయడంలో భారత దేశం పాత్ర గురించి మిస్రి స్పష్టంగా లేవనెత్తే ప్రయత్నం కూడా చేసినట్టు కనిపించడం లేదు. ఇటువంటి ప్రస్తావనలు దౌత్యపరమైన వ్యూహంలో భాగం కాగలవు. యూనస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని హసీనా ప్రకటనలు జారీ చేయడంపై ఢాకా ముఖ్యంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రకటనలపై ఆగ్రహం వ్యక్తం చేయడం ద్వారా పరోక్షంగా భారత్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నది. యూనస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు బేగం జియాను చూసి మాత్రమే భయపడుతున్నారు. సత్వరం ఎన్నికలు జరపాలని ఆమె చేస్తున్న ఒత్తిడుల కారణంగానే మరో సంవత్సరం వరకు సాధ్యం కాకపోవచ్చని అంటూ సంజాయిషీ ఇచ్చుకునే రీతిలో స్పందించారు. మొదటి నుండి షేక్ హసీనా భారత్‌కు మిత్రురాలు అనే భావనతో భారత ప్రభుత్వాలు బేగం జియాతో నామమాత్రపు సంబంధాలను సైతం ఏర్పర్చుకొనే ప్రయత్నాలు చేయలేదు. హసీనా ఆ దేశం నుండి నిష్క్రమించిన తర్వాత కూడా ఆమెతో సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నం చేయడం లేదు. నేడు బంగ్లాదేశ్‌లో భారత్ పట్ల సానుకూలంగా మాట్లాడేవారు లేని పరిస్థితి నెలకొంది. దౌత్యపరంగా, రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొనడం రెండు దేశాలకు సైతం అత్యవసరం. అయితే బంగ్లాదేశ్‌లో అటువంటి ఆదుర్దా ఉన్నట్లు కనిపించడం లేదు. వాణిజ్యం, కనెక్టివిటీ, విద్యుత్, నీరు, అభివృద్ధి సహకారం, కాన్సులర్ సహకారం, సాంస్కృతిక సహకారం వంటి అనేక సమస్యలు ఉన్నందున భారతదేశం సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి ఆసక్తి చూపుతున్నట్లు కనిస్తున్నది. భారతదేశం, బంగ్లాదేశ్ బలమైన వాణిజ్య సంబంధాన్ని కలిగి ఉన్నాయి. భారతదేశం ఆసియాలో బంగ్లాదేశ్‌కు రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, దక్షిణాసియాలో భారతదేశపు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బంగ్లాదేశ్ ఉంది. బంగ్లాదేశ్‌తో టాటా మోటార్స్, విఐపి, ఇమామి, మారికో, డాబర్, ఆసియన్ పెయింట్స్, పిడిలైట్, అదానీ పవర్, హీరో మోటోకార్ప్ వంటి ముఖ్యమైన సంస్థలు వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్నాయి.

# అమరజీవి ఆత్మార్పణ... ఆంధ్ర రాష్ట్ర అవతరణ



ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు విషయం ప్రస్తావనకు వస్తే, అమరజీవిగా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష గుర్తుకు రాక మానదు. 1952 డిసెంబర్ 19న భారత తొలి ప్రధాని పండిట్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు గురించి పార్లమెంట్ లో ప్రకటన చేశారు. ఈ విషయం గురించి మననం చేసు కోవాలంటే పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం అనివార్యం. మహాత్మా గాంధీ వ్యక్తిత్వానికి ప్రభావితులై, ఉద్యోగం వదిలి దాదాపు రెండు దశాబ్దాలు శ్రీరాములు సన్నిహితంగా మెదిలి, జాతిపిత అహింస సిద్ధాంతాన్ని విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది". స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. ఆ లేఖకు శ్రీరాములు స్పందిస్తూ, ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు. 1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు. దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు.."ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించ బడింది. ఆయన దీక్షను చేపట్టాక, విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు...1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం. 2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. శ్రీరాములు ఒక సందర్భంలో.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952)లో పేర్కొన బడింది. ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. మద్రాసు లేకుండా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 11 జిల్లాలు, బళ్ళారి జిల్లాలోని 3 తాలూకాలు ఇందులో భాగంగా ఉంటాయని ప్రకటించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు, బళ్ళారి జిల్లాలోని రాయదుర్గం, ఆదోని, ఆలూరు తాలుకాలను కలుపుకుని 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. బళ్ళారి జిల్లాలోని బళ్ళారి తాలూకాను ఎల్.ఎస్ మిశ్రా సంఘం నివేదిక ననుసరించి మైసూరు రాష్ట్రంలో కలిపేసారు. 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక ననుసరించి కొత్త రాష్ట్రానికి కర్నూలు ముఖ్యపట్టణం అయింది. టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రి అయ్యారు. సి.ఎం. త్రివేది గవర్నరు అయ్యారు. నెహ్రూ చేతుల మీదుగా జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో ఆంధ్రుల చిరకాల స్వప్నం ఫలించింది.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

నడికూడ, డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి): అంగన్వాడీ పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్ నాగరాజు అన్నారు. నడికూడ మండలంలోని నర్సక్కపల్లి గ్రామం లోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ఆయన మంగళవారం తనిఖీ చేశా రు. వంట చేసే ప్రదేశాన్ని, వంట పాత్రలను, భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు పరిశు భ్రమైన వాతావ రణంలో వండిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు సరిత, కోడెపాక సప్రి, రజని కుమారి, లక్ష్మీ, ఆయాలు రాధ, వనజ, ముత్యాల రమ పాల్గొన్నారు

# పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నడికూడ, డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి) వ్యవసాయ పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో పోరిక జైసింగ్, ఉద్యానవన శాఖ అధికారి తాదురి మదులిక అన్నారు. నడికూడ మండల కేంద్రంలో మిరప, మొక్క జొన్న, ఆయిల్పాం పంటలను, వరి, నర్సరీ లను అధికారులు క్షేత్ర సంద ర్శన నిర్వహించారు. ప్రధానంగా మిరపలో ఎర్రనల్లి, నల్లతామర పరుగుల నివారణకు థయోమిథోక్సామ్ 250మిలీ ఎకరానికి గానీ, ఇతర మందులు గానీ పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అలాగే అయిల్ పాం పంటలో అధిక దిగుబడులు సాధించడానికి మొదటి మూడు సంవత్సరాలలో వచ్చే ఆడ,మగ పూల గుత్తులను క్రమం తప్పకుండా తీసివేయాలని రైతులకు సూచించారు.

ఇతర సమస్యలకు పరిష్కార మా లను తెలిపారు. ఈ నెల 19న నడికూడ రైతు వేదికలో రైతు లకు పంటలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని, రైతులు హాజరు కావా లని అన్నారు.

# 8 కొనుగోలు కేంద్రల ద్వారా లక్ష ఇరవై ఆరువేల బస్తాల కొనుగోలు.

***ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన.***

***ఉమ్మడి జిల్లా ఓడీసీఎంఎస్ చైర్మన్ గూగులోతు రామస్వామినాయక్.***

ఖానాపురం డిసెంబర్18(వుదయం ప్రతినిధి): మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఎనిమిది కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష ఇరవై ఆరువేల బస్తాల వరి ధాన్యమును రైతుల వద్ద కొనుగోలు చేసినట్లు ఉమ్మడి జిల్లా ఓడిసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ మండల రైతులకు తెలిపారు. మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ఓడీసీఎంఎస్ చైర్మన్, Sand చైర్మన్ దేవినేని వేణుకృష్ణ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల వరి ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మ్యాచర్ వచ్చిన వరి ధాన్యమును వెనువెంటనే కొనుగోలు ఇన్చార్జులు కొనుగోలు చేస్తున్నట్లు చైర్మన్ తెలుపుతూ మండల వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలలోని రైతుల వరి ధాన్యం వారంలోపు ధాన్యం కొనుగోలు పూర్తి అయే అవకాశం ఉన్నట్లు





చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఎలబోయిన ఆంజనేయులు, సొసైటీ డైరెక్టర్లు మేకల కుమారస్వామి, బుద్దే తిరుపతి, మండల ప్రచార కార్యదర్శి పోతరాజు కరుణాకర్, నాయకులు రైతులు కతాల వెంకటేశ్వర్ రావు, పెరుమాండ్ల సత్యం, కొనకటి రాజు, భాషబోయిన అశోక్, కత్తల అశోక్, అనిల్,సాంబరాజు, బిక్షపతి, వెంకన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన సర్వేను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మిఖంగా తనిఖీ

నల్గొండ డిసెంబర్ 18(వుదయం ప్రతినిధి): మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన సర్వేను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మిఖంగా తనిఖీ చేశారు. జున్నాయి చింత గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న ఇండ్లకు వెళ్లి దరఖాస్తుదారు పేర్లు, ఇప్పటివరకు గ్రామంలో నిర్వహించిన సర్వే వివరాలు, తదితర వివరాలను పంచాయతీ సెక్రటరీ స్వీటీ, ఎంపీడీవో మంజుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా జిన్నాయి చింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 177 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 77 దరఖాస్తుల వివరాలను తనిఖీ చేసి అప్లోడ్ చేయడం జరిగిందని, తక్కినవి అప్లోడ్ చేయడం జరుగుతుందని పంచాయతీ



కార్యదర్శి జిల్లా కలెక్టర్ కు వివరించారు. పూర్తి వివరాలు అప్లోడ్ చేసిన తర్వాతే యాప్ లో సబ్మిట్ చేయాలని,లేనట్లయితే ఇబ్బందులు తలెత్తుతాయని కలెక్టర్ సూచించారు. తప్పనిసరిగా దరఖాస్తుదారుకు సంబంధించిన ఫోటోతో సహా ఇంటి ధ్రువపత్రాలు, ఒక వేళ కొత్తగా ఇల్లు నిర్మించుకునేలా ఉంటే కొత్త ఇంటి స్థలానికి సంబంధించిన వివరాలను అప్లోడ్ చేయాలని చెప్పారు.సర్వే సమయంలో దరఖాస్తుదారులు సర్వే బృందానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి,గృహ నిర్మాణ శాఖ పి డి రాజ్ కుమార్, ఎంపీ ఓ పద్మ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

**ఆదిలాబాద్‌లో 6.2 డిగ్రీలు నమోదు**

బోథ్, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): ఆదిలాబాద్‌లో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై.. ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. ఆదిలాబాద్‌లో 6.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక





వరంగల్ వెస్ట్ , డిసెంబర్ 18(వుదయం విలేకరి): ఈనెల 18 నుండి 21 వరకు హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగనున్న సీఎం కప్ బేజ్ బాల్ పోటీలకు కాజీపేట సోమిడి నందు గల ఎం జె పి గురుకుల విద్యార్థిని పెసరు అమృత లహరి, అయినవోలు పాతిఫండర్ విద్యార్థిని ఆర్ మధుప్రియ విద్యార్థుల ఎంపిక కావడం జరిగింది పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, పిఈటిలు అభినందించడం జరిగింది.

# పోలీస్ లఆధ్వర్యంలో మెగాహెల్త్ క్యాంప్

## ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు
## ప్రజలకు ఒక పెద్దలాగా, అన్నలాగా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
## కమీషనర్ ఎం. శ్రీనివాస్

చెన్నూరు డిసెంబర్18(వుదయం ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో దస్నాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ముఖ్య అతిథిగా హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వేమన్ పల్లి మండలం కల్లంపల్లి, రాజారాం, సంపుటం, దస్నాపూర్, గొర్లపల్లి, కొత్తకాలనీ, జిల్లెడ, జక్కేపల్లి, బుయ్యారం, రాచర్ల, ముల్కల్పేట్, ముక్కిడిగూడెం, సీతారా, చామనపల్లి, బద్దంపల్లి, బమ్మెనా, ఒడ్డుగూడెం, నాగారం, కేతన్పల్లి, కల్మల్పేట గ్రామాల నుండి సుమారు 800 మంది ఈ వైద్య శిబిరానికి హాజరయ్యారు. అన్ని విభాగాలలో నిపుణులైన వైద్యుల బృందం సహాయంతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రజల సమస్యలు, అవసరాల కోసం, భద్రత కోసం ఒక అన్న లాగా కుటుంబ పెద్దలాగా పోలీస్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకే కమీషనరేట్ పోలీస్ శాఖ నిరంతరం శ్రమిస్తుందని తెలియజేసారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రజా శ్రేయస్సును ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఆదివాసి గ్రామస్తులకు, మహిళలకు పోలీసులపై ఉన్న సదాభిప్రాయాన్ని, ప్రభుత్వం పట్ల ఉన్న నమ్మకాన్ని మరింత పెంపొందేలా గ్రామస్తుల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధికి చాలా దూరంగా బ్రతుకుతున్న ఆదివాసీలను



అభివృద్ధి మార్గం వైపు పయనించేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని సిపి తెలిపారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు తమ గ్రామంలో కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరడమైనది. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి ప్రజలు తమ ప్రశాంతమైన జీవితాన్ని శాంతియుత వాతావరణంలో గడిపేలాగా చూడడమే పోలీసుల ప్రధాన లక్ష్యం అని అన్నారు. చదువు, క్రీడల్లో ప్రతిభ కలిగిన యువకులను ప్రోత్సహించడానికి, పోలీస్ శాఖ అలాగే ప్రభుత్వం తోడుగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక పోలీసు అధికారులకు పల్లె నిద్ర కార్యక్రమం లో భాగంగా మీ వద్దకు వచ్చిన అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించడం జరుగుతుంది అని గ్రామ ప్రజలకు తెలియజేశారు. గ్రామాల్లోని యువత



బాగా చదువుకొని మంచి ఉద్యోగాల్లో చేరి, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని, తమ గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం అక్కడ పాల్గొన్న ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం వృద్దులకు దుప్పట్లను, యువతకు వాలీబాల్ కిట్లను సిపి పంపిణి చేశారు.

అనంతరం మెగా వైద్య శిబిరం లో కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు భోజన సౌకర్యం కల్పించడం జరిగింది.వైద్య సేవలు అందించడానికి వచ్చిన డాక్టర్ లను బృందానికి సీపీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసారు ఈ కార్యక్రమం లో ఈ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సిఐ సుధాకర్, చెన్నూర్ టౌన్ ఇన్స్పెక్టర్ రవీందర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

- ధాన్యం దిగుమతుల్లో ఇబ్బంది పెడుతున్న మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి.
- మ్యాచర్ వచ్చిన వెనువెంటనే ధాన్యం కొనుగోలు.
- జిల్లా వ్యాప్తంగా 82వేల844 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు.
- రైతుల ఖాతాలో 192 కోట్ల రూపాయలు జమ.
- ఐదు కోట్ల 50 లక్షల రూపాయల బోనస్ జామ.
- వరి ధాన్యం కొనుగోలు కేంద్రల పరిశీలన.
- అదనపు కలెక్టర్ సంధ్యారాణి.

ఖానాపురం డిసెంబర్ 18 వుదయం ప్రతినిధి.వరి ధాన్యము కొనుగోలను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కొనుగోలు ఇన్చార్జిలను ఆదేశించారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్ ఆవరణలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రమును అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 22 వేల బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలుపుతూ, రైతుల వరి ధాన్యం దిగుమతి విషయంలో ఏ మిల్ యజమాని అయిన రైతులకు ఇబ్బందులు కలిగిస్తే వెంటనే అట్టి మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టాలని సంబంధిత శాఖ అధికారులకు అడిషనల్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతుల వరి ధాన్యం మ్యాచర్ వచ్చిన వెనువెంటనే కొనుగోలు ఇన్చార్జులు రైతుల ధాన్యమును కొనుగోలు చేస్తున్నారని తెలుపుతూ, జిల్లా వ్యాప్తంగా 82వేల844 మెట్రిక్ టన్నుల వరి ధాన్యమును కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు తెలుపుతూ, రైతుల ఖాతాలో 192 కోట్ల రూపాయలు జమ అయినట్లు తెలుపుతూ మిగిలిన రైతుల ధాన్యం డబ్బులు త్వరలోనే వారి ఖాతాలో జమవుతాయని తెలుపుతూ ఇప్పటి వరకు ఐదు కోట్ల 50 లక్షల రూపాయలు రైతుల ఖాతాలో బోనస్ రూపాయలు జమ అయినట్లు తెలుపుతూ, ఇంకా 60 కోట్ల రూపాయల బోనస్ రైతుల ఖాతాలో జమ కావాలని తొందరలోనే మిగిలిన రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమవుతాయని రైతులకు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ కిష్టయ్య, సివిల్ సప్లై డిఎం





సంధ్యారాణి, డిటి సంధ్య, తాహసిల్దార్ పీ కిరణ్ కుమార్,ఎంపీడీవో భారతి, క్వాలిటీ కంట్రోల్ రాజయ్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, రికార్డ్ అసిస్టెంట్లు ఐలేష్, సుధాకర్, రవికుమార్, గోవర్ధన్, స్వామి, రైతులు పరుచూరి సుబ్బారావు, మచ్చిక అశోక్, మరి రామస్వామి, బోడ పూలు,కందుల వెంకన్న, స్టాఫ్ అసిస్టెంట్ మెరుగు రాజు, సొసైటీ సిబ్బంది కొనుగోలు ఇన్చార్జులు వినయ్, అశోక్, కొమురయ్య, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీ వనం సెంటర్ ను ప్రారంభించిన రూరల్ ఎస్సై శ్రీకాంత్ ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు

(గద్వాల డిసెంబర్ 18 వుదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల రూరల్ నిరుద్యోగులు స్వయం ఉపాధిని కల్పించుకొని నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించాలని గద్వాల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు సూచించారు. బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో టీ వనం సెంటర్ షాప్ యజమానులు నరేష్,కిరణ్ కుమార్ తో కలిసి టీ సెంటర్ ను ఎస్సై లు ముఖ్య అతిథిగా హాజరై




ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.సుచి శుభ్రతతో కూడిన రుచికరమైన టి,అందజేసి వినియోగదారులను ఆకట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జూనియర్ అడ్వకేట్ పాండు ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు

# 07వ నెలలో అడుగు పెట్టబోతున్న ఎస్ విక్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన

## అవ్వ తాత మాజీ ఎంపీపీ శ్యామల రాజారెడ్డి

(గద్వాల డిసెంబర్ 18 వుదయం ప్రతినిధి ) :జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామం చెందిన సీనియర్ సీడ్ ఆర్గనైజర్ సౌజన్య భరత్ రెడ్డి దంపతులమొట్టమొదటి ముద్దుల కుమారుడు ఆరవ నెల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నటికీ తరగని ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సుఖశాంతులను ప్రసాదించాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటూఎస్ విక్ రెడ్డి అవ్వ తాత శుభాశీస్సులు దీర్ఘాయుష్మాన్ భవ! 07వ నెల శుభాకాంక్షలు తెలియజేశారు.



# శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు

వరంగల్ వెస్ట్ , డిసెంబర్ 18(వుదయం విలేకరి): మేయర్ నివాస పరిధిలో మట్టెవాడ ,రామన్నపేట్, పడిశాల వీధిలో ఇనుప విద్యుత్ స్తంభాలు వంగి శిలుముతో విరిగిపోయే స్థితిలో , రహదారి కి అడ్డుగా ఉన్నవి. స్థానికులు భయభ్రాంతులతో దారికి అడ్డుగా ఉన్న,వంగిన ఇనుప స్తంభాలను తొలగించవలసిందిగా కోరుతున్నారు... ఇంతకుముందు ఎన్నోసార్లు దీన్ని కంప్లైంట్ చేసిన ఎవరూ పట్టించుకోవడంలోవిఫలం అయినారని సాయంత్రం వేళలో ఈ దారి గుండా వెళ్లడానికి భయపడుతున్నారని స్థానికుల తెలుపుతున్నారు..



## నా దృక్పథం

యదార్థవాదిని,
భ్రమలను, మాయలను,
దరిజేరనీయను.
నిజాలకే జీవితం చిన్నది,
మాయలకు మర్మాలకు చోటేది?
నేను ఆశావాదిని,
మనుషులపై నమ్మకం ఉంది,
అవివేకుడు ఒకడు ఉండొచ్చు,
వివేకులు పదుల్లో ఉంటారు,
ఐకమత్యమే బలం
దారికి తెస్తాం
ఒకే తాటిపై నడుస్తాం
సత్యమేవ జయతే ,
నమ్మకముంది .

- సీతా రామ రాజు సనపల

# మున్సిపల్ చైర్మన్ బుర్రి నివాసంలో ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం

## పెద్ద సంఖ్యలో పాల్గొన్న స్వాములు

## అయ్యప్ప నామ స్మరణంతో మార్మోగిన శ్రీనగర్ కాలనీ



నల్గొండ డిసెంబర్ 18(వుదయం ప్రతినిధి): నల్గొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో బుధవారం శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహాపడిపూజ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప గురుస్వాములు, అర్చక స్వాములు శాస్త్రయుక్తంగా అభిషేకాలు,మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించగా ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి-చైతన్య దంపతులు, కుటుంబ సభ్యులు ఈ మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొనగా అభిషేకాలు నిర్వహించిగా పంచామృతాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. పదునెట్టాంబరి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన ప్రసాదం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప గురు స్వాములు,స్వాముల అందరి సహకారంతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చెప్పారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల తో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ పట్టణాన్ని ఆదర్శం మున్సిపాలిటీగా తీర్చిదిద్దానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, శ్యామ్ గురు స్వామి, కొలను రవికుమార్, అశోక్, మేడం విశ్వ ప్రసాద్, రాంపాటి శ్రీను గురు స్వామి, కోమటిరెడ్డి పృధ్వీధర్ రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి, పలువురు అయ్యావ్ప గురు స్వాములు, స్వాములు,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# విద్యార్థినిల తల్లిదండ్రులతో ప్రిన్సిపల్ కోఆర్డినేషన్గా ఉండాలి.

## ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్ సంధ్యారాణి.

ఖానాపురం డిసెంబర్ 18 వుదయం ప్రతినిధి.మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థినిల తల్లిదండ్రులతో ప్రిన్సిపల్ జయశ్రీ కోఆర్డినేషన్ తో ఉండాలే తప్ప విద్యార్థినిల తల్లిదండ్రులతో ప్రిన్సిపల్ అమర్యాదగా ప్రవర్తించవద్దని ప్రిన్సిపల్ పై అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను పరిసర ప్రాంతాలను స్వయంగా అదనపు కలెక్టర్ పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపల్కు తెలుపుతూ విద్యార్థినిలతో పలు విషయాలను మాట్లాడి అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం అదనపు కలెక్టర్ చేశారు. అనంతరం విద్యార్థినిలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినిలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని అలాగే సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినిలకు తెలుపుతూ, విద్యార్థినిల తల్లిదండ్రులతో



ప్రిన్సిపల్ ఉపాధ్యాయ బృందం కోఆర్డినేషన్తో ముందుకు వెళ్లాలని అదనపు కలెక్టర్ తెలుపుతూ. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ పీ కిరణ్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, రికార్డ్ అసిస్టెంట్లు ఐలేష్, సుధాకర్, గోవర్ధన్, రవికుమార్, స్వామి, ఉపాధ్యాయ బృందము విద్యార్థినిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శివ కేశవ పౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



కమలాపూర్ డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి) శ్రీ శివ కేశవ పౌండేషన్ హనుమకొండ వారు శమనుపల్లి గ్రామంలో మెడికవర్ హాస్పిటల్ మరియు శరత్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరాన్ని గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియపరచడం జరిగింది. చలికాలం దృష్ట్యా ఉష్ణోగ్రతలు విపరీతంగా తగ్గుతున్న నేపథ్యంలో వృద్ధులు మరియు చిన్నపిల్లలు అతి జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యరీత్యా చిన్న ఇబ్బంది ఉన్నప్పటికిని వెంటనే వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్యాల రవీందర్ రెడ్డి మండల పంచాయతీ అధికారి సిహెచ్.రవి, పంచాయతీ కార్యదర్శి సాహితీ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# నిండు సభలో అంబేద్కర్ ను అవమానిస్తారా..?

## హోమ్ మంత్రి అమిత్ షా

## భారత ప్రజలకు భే షరతుగా క్షమాపణలు చెప్పాలి.

## అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు డిమాండ్

లక్షెట్టిపేట డిసెంబర్ 18 :- (వుదయం ప్రతినిధి )కేంద్ర హోమ్ మంత్రి నిండు సభలో భారత రత్న, రాజ్యాంగ రచయిత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ను అవమానించి నందుకు భారత ప్రజలకు భే షరతుగా క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ను విమర్శించినోళ్లంతా కాలాగర్భంలో కలిసి పోయారని, అంబేద్కర్ పేరు మాత్రం చరిత్రలో చిర స్థాయిగా నిలిచి పోతుందన్నారు. బీజేపీ నిరంతరం రాజ్యాంగంపై దాడిచేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కులను హరిస్తుందన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ ఇప్పటికైనా తమ అగ్రకుల



బుద్ధి మార్చుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చి రాజ్యాంగంపై దాడి చేసి మనువాదాన్ని పునః ప్రతిష్ట చేయాలని చూడడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా బీజేపీ, అమిత్ షా బుద్ధి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మేకల బానేష్, కల్లేపల్లి విక్రమ్, పులి సునీల్, అల్లంపల్లి రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాసర గోదావరిలో ఆత్మహత్యలపై అధికారులతో కలిసి రివ్యూ నిర్వహించిన జిల్లా ఎస్పీ



బాసర డిసెంబర్ 18 ( వుదయం ప్రతినిధి ) వార్త పత్రికలు, ఛానల్ లలో వచ్చిన కథనాలకు చలించిన నిర్మల్ జిల్లా ఎస్పి జానకి షర్మిల. బాసర గోదావరి నది బ్రిడ్జ్ ని భైన్సా ఏ ఎస్పి అవినాష్ కుమార్, ముధోల్ సీ ఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ లతో కలసి సందర్శించిన జిల్లా ఎస్పి డా.జానకి షర్మిల. స్థానిక పోలీస్ స్టేషన్ లో పోలీస్ అధికారులతో కలసి రివ్యూ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పి జానకి షర్మిల. నేను చార్జ్ తీసుకున్న గత సంవత్సరం నుండి బాసర బ్రిడ్జ్ పై ఆత్మహత్య లు నన్ను కదిలించాయి. ప్రభుత్వ సహాయం తో బాసర బ్రిడ్జి పై ఇరు వైపులా సుమారు ఆరు ఫీట్ల జాలిలు , సిసి కెమెరా లు ఏర్పాటు చేసి బాసర పోలీస్ స్టేషన్ కి అనుసంధానం చేస్తాం. 24/ 7 ఇద్దరు మహిళా కానిస్టేబుల్ లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు బాసర బ్రిడ్జ్ పై బ్లూకోట్ సిబ్బందిని నియమిస్తాం. ఎల్లవేళలా గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచి ఆత్మహత్య ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా.. బాసర బ్రిడ్జి పై సగ భాగం నిజామాబాద్ జిల్లా పరిధి లో ఉండటం తో నిజామాబాద్ సీపి తో మాట్లాడి వారి సమన్వయం తో ఆత్మహత్య ల నివారణకు నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉంది. జిల్లా ఎస్పి జానకి షర్మిల.

# పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు పెంచాలి.

## బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు.



నర్సంపేట డిసెంబర్18(వుదయం ప్రతినిధి): . నిత్యవసర సరుకుల రేట్లు రోజురోజుకీ ఆకాశాన్ని అంటుతున్నాయని పెరిగిన ధరల కనుగుణంగా హమాలి కూలి రేట్లు పెంచాలని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. మార్కెట్ ఖరీదు, ఫర్టిలైజర్ యూనియన్, ఐరన్ అండ్ మర్చంట్ యూనియన్ అధ్యక్షుడు వంగేటి గోవర్ధన్, దోమ కుంట్ల సురేష్ బూర అశోక్ లకు బి ఆర్ టి యు, ఏఐటీయూసీ అనుబంధం హామాలి సంఘల ఆధ్వర్యంలో నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా గోనె యువరాజు హమాలి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరు లక్ష్మీనారాయణ ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు నూతన రేట్ల ఒప్పందం ఉంటుందని డిసెంబర్ 21 తో ఆ గడువు పూర్తవుతుంది కావున నూతన రేట్ల అగ్రిమెంట్ చేసుకోవడానికి కార్మిక సంఘాలతో చర్చలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండెబోయిన కొమరయ్య హమాలి పెద్దమనుషులు ఎడ్ల నాగులు యారా చంద్రమౌళి వడిచెర్ల శ్రీనివాస్ గాండ్ల రాములు రమేష్ ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీ



దమ్మపేట డిసెంబర్18(వుదయం ప్రతినిధి): :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట పోలీసువారి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీ దమ్మపేట జడ్.పి.హెచ్.ఎస్ స్కూలు విద్యార్థులతో కలిసి ఈ యొక్క ర్యాలీ నిర్వహించడం జరిగింది. గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కాకుండా ఉండడానికి ఉండటం కోసం ఈ యొక్క ర్యాలీని నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఎవరైనా గంజాయి సేవిస్తున్నారని కానీ ,గంజాయి సరఫరా చేస్తున్నారని కానీ సమాచారం ఉంటే దమ్ము పేట పోలీస్ స్టేషన్ నందు తెలియజేయగలరు. అని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మరియు సిబ్బంది మరియు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

చొప్పదండి, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చొప్పదండి యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగుల ప్రశాంత్ కుమార్ విమర్శించారు. మండలంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే యోచన రాష్ట్రాల్లోని ప్రభుత్వాల హక్కులను హరించడమేనన్నారు.

# ఎంఆర్పిఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం.

## రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్.



పరకాల డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణం మరియు మండల ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ మాట్లాడుతూ ఎం ఆర్ పి ఎస్ , యు.ఎస్.పి మరియు అనుబంధ సంఘాల నాయకులకు కార్యకర్తలకు సామాజిక ఉద్యమ నమస్సులతో రేపు ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమీషన్ డిసెంబర్ 19 తేది నాడు విచారణకమిషన్ గౌ.డా జస్టిస్ షమీమ్ అఖ్తర్ షెడ్యూల్డు కులాల ఉపవర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం జిల్లా పరిధిలో బహిరంగ విచారణ కోసం ఈనెల 19 వ తేదీ నాడు హనుమకొండ జిల్లాకు విచ్చేయుచున్నారు. కావున ఉమ్మడి వరంగల్ జిల్లాఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మరియు అన్ని అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయము నందు ఈ విచారణ తేది. 19-12-2024 నాడు ఉదయం 11:00 గం.ల నుండి మధ్యాహ్నం 2:00 గం.ల వరకు డా.జస్టిస్ షమీమ్ అఖ్తర్ స్వీకరిస్తారు. కావున సమయానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మరియు అన్ని అనుబంధ సంఘాల నాయకులు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పరకాల పట్టణం మరియు మండల ఎమ్మార్పీ సంబంధించిన నాయకులు సిలువేరు ప్రవీణ్ కుమార్ మాదిగ కొయ్యడ కుమార్ మాదిగ కొమ్ముల చిరంజీవి మాదిగ చిలువేరు కుమార్ మాదిగ పసుల నాగరాజు మాదిగ బొచ్చు విక్రమ్ మాదిగ కొయ్యడ శివకుమార్ మాదిగ పెండెల చంద్రమౌళి మాదిగ పెండల రవీందర్ మాదిగ చిలువేరు చిరంజీవి మాదిగ పెండల మహేందర్ మాదిగ బొచ్చు రాజ్ కుమార్ మాదిగ బొట్ల భాస్కర్ మాదిగ మడికొండ ప్రమోద్ మాదిగ హనుమకొండ విజయ్ కుమార్ మాదిగ బండారి రాజు మాదిగ కోకిల సాయి కృష్ణ మాదిగ కొయ్యడా అఖిల్ మాదిగ ఏకు ప్రమోద్ మాదిగ తిక్క రాజు మాదిగ శ్రీపతి రాజు మాదిగ కొయ్యడ రాజేష్ మాదిగలు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి.

## జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు,




నాగర్ కర్నూల్ డిసెంబర్ 18(వుదయం ప్రతినిధి) బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అదనపు కలెక్టర్ జిల్లాలోని రెవిన్యూ ,నీటి పారుదల శాఖ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్, శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు .

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టు లైన మహాత్మా గాంధీ కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు, మార్కండేయ ప్రాజెక్టు, అచ్చంపేట ప్రాజెక్టు, కర్నే తండా ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు, అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అధికారులకు సూచించారు . సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ వివరాలను ప్రాజెక్టుల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా సేకరించాల్సిన మొత్తం భూమి 25247.13 ఎకరాలకు గాను 21613.87 ఎకరాల భూమిని సేకరించామని, ఇంకా 3633.26 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని సంబంధిత అధికారులు త్వరితగతిన భూసేకరణ జరపాలని అధికారులను ఆదేశించారు. , నేషనల్ హైవే 167 కు సంబంధించిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, తెలియజేశారు. ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అదన కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎం జి కే ఎల్ ఐ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ రెడ్డి, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, నాగర్ కర్నూల్ ఆర్ డి ఓ సురేష్, అచ్చంపేట ఆర్డీవో మాధవి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, ఏఈ, డి ఈ, ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్ అభయారణ్యంలో పర్యటించిన ఏజీ సభ్యుల బృందం




జన్నారం,డిసెంబర్ 18(వుదయం విలేకరి) హైదరాబాద్ కు చెందిన అడ్వకేట్ జనరల్ బృందం సభ్యులు కవ్వాల్ అభయారణ్యంలో పర్యటించారు.బుధవారం ఉదయం వారు జన్నారం మండలంలోని గోండుగూడా, బైసన్ కుంట తదితర అటవీ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా అభయారణంలో పెంచుతున్న అటవీ క్షేత్రాలు,అడవులు, వన్యప్రాణుల రక్షణ గురించి తీసుకుంటున్న చర్యలను వారికి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీ బృందం సభ్యులు,అటవీ అధికారులు పాల్గొన్నారు.

# టీపీసీసీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పరకాల కాంగ్రెస్ నాయకులు.



పరకాల డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి )దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా గౌతమ్ ఆదాని ఆర్థిక అవకతవకలు, మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోదీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి రాజ్ భవన్ ముందు పాల్గొన్న ధర్నా కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు కొయ్యాడా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీ చైర్మన్ సోదా అనిత-రామకృష్ణ కొలుగురి రాజేశ్వర్ రావు, మేరుగు శ్రీశైలం,ఎండీ జాఫర్ రిజ్వి,పసుల భద్రయ్య, బొచ్చు శ్రీధర్,మీడియా ఇంచార్జి ధార్న వేణు,సోషల్ మీడియా ఇంచార్జి గడ్డం శివకుమార్ గార్లు పాల్గొన్నారు.

# నర్సంపేట శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 35వ మహా అన్న ప్రసాద వితరణ.

### వాంకుడోత్ అమిత్ కుమార్ స్వరూప బీజేపీ రాష్ట్ర నాయకురాలు.



నర్సంపేట డిసెంబర్18(వుదయం ప్రతినిధి): నర్సంపేటలోని శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా, ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్ కమిటీ బృందం ఆధ్వర్యంలో గుగులోతు రామస్వామి, రుద్ర ఓంప్రకాష్ మల్లేశ్వరి, బార్ధాన్ అసోసియేషన్ నర్సంపేట, శింగిరికొండ ఉపేందర్, ఓద్దుల కరుణాకర్ రెడ్డి కవిత, కృష్ణ హైమా, వాంకుడోత్ అమిత్ కుమార్ స్వరూప బిజెపి రాష్ట్ర నాయకురాలు, పోటు రవీందర్ రెడ్డి సాంబలక్ష్మి, తోటకూరి రాజు గిరగానీ సాంబయ్య గౌడ్, గణేష్ పాండ్ వరంగల్ సిద్ధ రవీందర్ దీప్తి మాదూరి పావని వేణు కడప వెంకటేశ్వర సునితరామస్వామి, యాదగిరిరావు నరసింహారెడ్డి రాజేష్ ప్రభాకర్ వాసు సాంబ రెడ్డి సోమలింగం రాజు దగ్గు రవీందర్రావు వెంకటేశ్వరరావు జయపాల్ రెడ్డి అడుప కృష్ణ సైప సురేష్ కొల్లూరి లక్ష్మీనారాయణ కమటాల బుచ్చయ్య సభ్యులు కృష్ణారెడ్డి కొండం వీరేంద్ర స్వామి బూరగాని సారయ్య గోలి కుమారస్వామి లు నూతన వస్త్రాలు ధరించి స్వామివారి అభిషేక పూజలో పాల్గొనగా ఆలయ అర్చకులు ఫ్రాన్స్ చే ఆశీర్వచన జరుపగా నైవేద్యం శిరస్సుపై ధరించి పదినిమిట్టాంబడి పై జోతులు వెలిగిస్తూ టెంకాయలు సమర్పించగా నైవేద్యం స్వామివారికి సమర్పణ చేయుగా మాలదర స్వాములకు భక్తులకి మహా అన్నదాన ప్రసాద వితరణ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా, ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, శ్రీరాముల శంకరయ్య, బండారుపల్లి చెంచారావు, దొడ్డ వేణు, మల్యాల రాజు, దాతల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల స్కానింగ్ సెంటర్ల తనిఖీ





మహబూబాబాద్ డిసెంబర్ 18(వుదయం ప్రతినిధి ):జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. మురళీధర్ ఆదేశానుసారం, బుధవారం మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం నేతృత్వంలో మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులైన ధరణి, మేడ్ విజన్, నిక్మా హెల్త్ కేర్ సెంటర్, తేజస్వి నర్సింగ్ హోమ్, మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలో స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ, మేనేజ్మెంట్ వారు అంధించే సేవలకు తీసుకునే రుసుములకు సంబంధించిన ధరల పట్టికను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఆసుపత్రు లో సిబ్బంది యొక్క వివరాలను మరియు వారి యొక్క అర్హత సర్టిఫికెట్స్ ను అందుబాటులో వుంచాలని, ఒకవేళ సిబ్బంధిని గాని డాక్టర్ లను కానీ మార్చినట్టైతే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయమునకు అట్టి వివరములు ముందు గానే తెలియ పరచాలని, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష నేరమని, శిక్షార్హులవుతారని పేర్కొంటూ, ప్రతి నెల ఐదవ తేదీ లోపు పిసిపిఎన్డిటి ఎఫ్ దరఖాస్తులు జిల్లా కార్యాలయానికి పంపించాలని అన్నారు.

ఈ తనికీలలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, ఎల్ డి కంప్యూటర్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపిన

### – కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



శాయంపేట,18 (వుదయం ప్రతినిధి) నిష్పక్షపాతంగా ఉంటూ.. మండల ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్సై పరమేశ్వర్ ను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. బదిలీలలో భాగంగా శాయంపేట నూతన ఎస్సైగా పరమేశ్వర్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి బుచ్చిరెడ్డి ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి బుజ్జన్న, డైరెక్టర్ శానం కుమారస్వామి, నాయకులు చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, చింతల రవిపాల్, లాడే రాజ్ కుమార్, మార్కండేయ, వరదరాజు, సతీష్, వీరన్న, విష్ణు, భాస్కర్, అశోక్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.బి

# తుడుందెబ్బ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి.

### తుడుందెబ్బ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సువర్ణపాక వెంకటరత్నం.



మహబూబాబాద్ జిల్లా,డిసెంబర్ 18(వుదయం ప్రతినిధి ):డిసెంబర్ 22,23 న ఏటూర్ నాగారం లో జరిగే తుడుందెబ్బ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలనీ తుడుందెబ్బ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సువర్ణపాక వెంకటరత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారతదేశంలో వేల సంవత్సరాలుగా అడవులు, కొండలను నివాసంగా ఏర్పరచుకొని ఆదివాసి తెగలు జీవనం కొనసాగిస్తున్నాయి. వీరికి ప్రత్యేక భాష,సంస్కృతి,సంప్రదాయం కలిగియున్నారు. ఆదివాసి తెగల జీవన విధానం అడవులతో ముడిపడి ఉన్నది. జీవన ఆధారమైనట్టు వంటి అడవి ప్రాంతంలోని భూ సంపద, నీటి వనరులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆదివాసులు ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండడం వలన, నిజం ప్రభుత్వం, స్వతంత్రం ఏర్పడ్డ తరువాత భారత రాజ్యాంగం ఏర్పడేటప్పుడు షెడ్యూల్ తెగలుగా గుర్తించబడి, భారత రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్ లో ప్రత్యేకమైన చట్టాలను కలిగి ఉన్నారు. ఆదివాసి తెగలపై రాష్ట్ర ప్రభుత్వాలు స్వతంత్రం అనంతరం శ్రమ, ఆర్థిక, సామాజిక,రాజకీయ పీడన కొనసాగిస్తున్నాయి. భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులు, చట్టాలను గుర్తించిన ఆదివాసీలుహక్కులు,చట్టాలు అమలు జరగాలని ఆదివాసి పోరాట వీరులు: రాంజీ గోండు, బిర్సా ముండా, గూండా దూర్, మల్లు దొర, గంటం దొర, సోయం గంగులు పోరాటాలను ఉద్యమ స్ఫూర్తితో ఆదివాసులు మా ఊర్లో – మా రాజ్యం, జల్ జంగిల్ జమీన్ కొరకు లి1996 ఆగస్టు 6వ తారీకున ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. తుడుం దెబ్బ ఆవీర్భవమే షెడ్యూల్డ్ తెగల వర్గీకరణ కోసం ఏర్పాటు చేయబడింది. విద్య, ఉద్యోగ,రాజకీయ, ఆర్థిక, సంస్కృతిక, సామాజికంగా అభివృద్ధి చెందాలని తుడుం దెబ్బ మొదటి నుండి ఎస్ టి వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నది. నాటి నుండి నేటి వరకు భారత రాజ్యాంగ హక్కులు, చట్టాలు అమలు కొరకు 5వ షెడ్యూల్ ప్రాంత. అటవీ సంపద, పరిరక్షణ కొరకు విద్య, ఉద్యోగ, వైద్యం, రోడ్డు సౌకర్యాలు, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ పథకాల కొరకు నిరంతరం పోరాటం చేస్తున్నది. ఆదివాసి ఉద్యోగులు, ఆదివాసి విద్యార్థులు, ఆదివాసి మహిళలు, ఆదివాసి నిరుద్యోగులు, ఆదివాసి ప్రజలందరూ తుడుం దెబ్బ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అందరూ అన్ని విధాలుగా సహకరించాలని పిలుపునిస్తున్నామని తెలిపారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ములుగు, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు రఘునాథపల్లి మండలంలో పట్టుకున్నారు. యాదాద్రి జిల్లాకు చెందిన ధరావత్ హరి కిరణ్,

భూక్య ఆంజనేయులు, గుగులతు లింగన్న అనే ముగ్గురు వ్యక్తులు కలిసి నీడిగొండ నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ. లక్ష విలువ చేసే 40 క్వింటాళ్ల బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

# బిజెపి నూతన బూత్ అధ్యక్షులు ఎన్నిక



రాయపర్తి డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి):మండలంలోని పెర్కవేడు గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదులో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు నూనె అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా అసెంబ్లీ కో కన్వీనర్ సుంకరేనేని కోటేశ్వరరావు పాల్గొని బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ప్రతి ఆరు సంవత్సరాలు ఒకసారి సభ్యత్వం కార్యక్రమం నిర్వహించి తదనంతరం బూత్ అధ్యక్షులను మండల అధ్యక్షులను జిల్లా అధ్యక్షులను రాష్ట్ర అధ్యక్షులను ఎన్నుకుంటారని ఇది భారతీయ జనతా పార్టీ యొక్క సిద్ధాంతమని బూతులలో పార్టీ ఎంత పటిష్టంగా ఉంటే అంతా అభివృద్ధి చెందుతుందని ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం కలిగిన పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీ అని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి రాష్ట్రంలో ప్రతి గ్రామానికి భారతీయ జనతా పార్టీ విస్తరించిందని తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ రానున్న రోజుల్లో అధికారులకు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేర్కవేడు గ్రామంలో 179 బూతు అధ్యక్షులుగా కూన యాదగిరి , 181 బూతు అధ్యక్షులుగా రాసాల రాకేష్ యాదవ్ , 182 బూతు అధ్యక్షులుగా రాజు , ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎనగందుల శ్రావణ్ కుమార్ శక్తి కేంద్ర ఇన్చార్జ్ నిమ్మల అనిల్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ యువ మోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ యాదవ్ కార్యకర్తలు రాకేష్ నిఖిల్ రామకృష్ణ సంపత్ సాయి కుమార్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

### నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సర్వే నిర్వహించాలి.

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,



మహబూబాబాద్ జిల్లా,డిసెంబర్ 18(వుదయం ప్రతినిధి ):బుధవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, గూడూరు మండలం, బొద్దుగొండ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వేను, అయోధ్యపురం, దామరచర్ల ,గూడూరు లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఆశ్రమ హై స్కూల్, టీటీడబ్ల్యూ ఆర్ఎస్జెసి లలో మధ్యాహ్న భోజనం తనిఖీ, పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు

ప్రభుత్వం సూచించిన ప్రకారం సిబ్బంది సర్వే నిర్వహించాలని, పక్క సమాచారం సేకరించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు, జిల్లా వ్యాప్తంగా వేగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల వివరాలు సేకరించి ఇందిరమ్మ కమిటీ సభ్యులు భాగస్వాములను చేస్తూ నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సర్వే చేస్తున్నామన్నారు,మండలంలోని దామరచర్ల లో గిరిజన కార్పొరేషన్, అయోధ్య పురం, ఐకెపి ద్వారా నిర్వహించబడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల నిర్వహించాలని అన్నారు ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాల రిజిస్టర్ లను తనిఖీ చేశారు,

ధాన్యానికి సంబంధించి వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆశ్రమ హై స్కూల్, టీటీడబ్ల్యూ ఆర్ఎస్జెసి లలో మధ్యాహ్న భోజనం తనిఖీ, పరిసరాలను పరిశీలించారు, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ షెడ్యూల్ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని, వసతి గృహంలో పరిసరాలను ఎప్పటికప్పుడు సానిటేషన్ చేపించాలని స్టడీ రూమ్, మరుగుదొడ్లు, క్లాస్ రూమ్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు,విద్యార్థినీ ,విద్యార్థుల యొక్క మానసిక, విద్య ,వైద్యం స్థితిగతులను గమనిస్తూ ఉండాలని, వంద శాతం ఫలితాలు వచ్చే విధంగా ప్రణాళిక ప్రకారం విద్యా బోధనలు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చలో రాజ్ భవన్" కార్యక్రమంలో పాల్గొన్న పీర్జాదిగూడ కాంగ్రెస్ నాయకులు

### తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో భారీగా ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు





మేడిపల్లి డిసెంబర్18(వుదయం ప్రతినిధి): అమెరికాలో గౌతమ్ ఆధాని పై ఆర్థిక అవకతవకలు,నేరారోపణలు, అవినీతి, మోసం,మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, మణిపూర్ లో జరిగిన అల్లర్లు, విధ్వంశాలపై మోడీ సర్కార్ స్పందించకపోవడంతో మోడీ వైఖరిని ఖండిస్తూ ఏఐసిసి పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛలో రాజ్ భవన్' కార్యక్రమం విజయవంతమైంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన నిరసన ర్యాలీ నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు సాగింది. ఈ యొక్క నిరసన కు మద్దతుగా రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర మంత్రులుపాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్,టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అధ్యక్షతన పీర్జాదిగూడ నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో "చలో రాజ్ భవన్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,పీర్జాదిగూడ మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రు నాయక్,ఉపాధ్యక్షులు మహ్మద్ మజర్, వెంకటేష్ గౌడ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిరాం గౌడ్, సీనియర్ నాయకులు ,మహేష్,శ్యామ్, సాయి రెడ్డి, పఠాన్, మహేశ్వరప్ప మరియు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు శారదా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాపూర్ లోని పాఠశాలలకు 4370 సానిటరీ ప్యాడ్స్ అందజేత






కాసిపేట డిసెంబర్ 18 (వుదయం విలేకరి) ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ దేవాపూర్ కంపెనీ వారు దేవాపూర్ లోని జడ్పీహెచ్ఎస్ ఆశ్రమ పాఠశాల డి ఏవి పాఠశాలల బాలికలకు మహిళలు తమ జీవిత కాలంలో ఎదుర్కొనే ప్రధాన సమస్య అయిన రుతుస్రావం(పీరియడ్స్) లో ఉపయోగించే సానిటరీ ప్యాడ్స్ అందించాలనే మంచి ఉద్దేశంతో మూడు పాఠశాలలకు గాను మొత్తం 4370 శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందించారు, యూనిట్ హెడ్ బాల గిరిధర్ ఆధ్వర్యంలో దేవాపూర్ లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థినిలకు 550 ఆశ్రమ పాఠశాల కు 1420 డిఏవి పాఠశాల కు 2400 చొప్పున శానిటరీ ప్యాడ్స్ ను అందజేశారు. అందించిన వారిలో జీఎం హెచ్ఆర్ ఆనంద్ కులకర్ణి , ఏటీఎం హెచ్ఆర్ ఉమా శంకర్ తదితరులు ఉన్నారు

# కబ్జా కోరల్లో మెల్ల కుంట చెరువు...!

- శిఖం భూమిని పట్టాలోకి చేర్చి నిర్మాణాలు..
- అడ్డు కట్ట వేయడంలో అధికారులు విఫలం..
- కుంట భూమిని కాపాడాలంటూ స్థానికుల డిమాండ్





కరీంనగర్ (వుదయం ప్రతినిధి) : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములు హారతి కర్పూరంల కరిగిపోతున్నాయి. చెరువులు, కుంటలు అనే తేడా లేకుండా భూ బకాసురులు కనిపించిన భూమినల్లా దర్జాగా కబ్జాచేస్తూ ఆ తర్వాత అపార్ట్మెంట్స్, వెంచర్‌లుగా మార్చి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములకు ఆనుకునే పట్టా భూములు ఉండడం కబ్జాదారులకు కలిసోస్తుంది. పట్టాలు ఉన్న సర్వే నెంబర్‌లకు ఏ/బీ/సీ/1/2 బై నెంబర్లు వేసి ప్రభుత్వ భూములను కూడా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇటీవలే కరీంనగర్ కార్పొరేషన్ లో విలీనమైన సీతారాంపూర్ 21వ డివిజన్ పరిధిలోని మెల్ల కుంట చెరువు భూమి కబ్జాదారుల చేతుల్లో ఆక్రమణకు గురవుతుంది. డివిజన్ లోని సర్వే నెంబర్ 71లో ప్రభుత్వ భూమి 13 ఎకరాల 26 గుంటలు కలదు. కాగా ఈ సర్వే నెంబర్ పక్కనే ఆనుకుని ఉన్న కొందరు పట్టాదారులు కుంట శిఖం భూమిని ఆక్రమించుకుని, దానిని పట్టా భూమిగా చిత్రీకరిస్తూ..పాత తేదీల్లో గ్రామపంచాయతీ నుంచి అనుమతులు పొందినట్లుగా పత్రాలు సృష్టించి, అందులో నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం. ఆ నిర్మాణాలకు సెల్ఫ్ అసెస్మెంట్ పేరుతో మున్సిపల్ నుంచి ఇంటి నెంబర్లు కూడా పొందినట్ల తెలుస్తుంది. ఇలా కుంట భూమిని అక్రమంగా ఆక్రమించుకుని అందులో అపార్ట్మెంట్స్, ఇండిపెండెంట్ హౌసెస్ నిర్మించి అమాయక ప్రజలకు మోసపూరితంగా అమ్మకాలు చేస్తున్నారు. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నట్లు తెలుస్తుంది. సీతారాపూర్ కరీంనగర్ కార్పొరేషన్ లో విలీనం కావడంతో ఈ ప్రాంతాల్లో నివాస గృహాలు, భారీ భవంతుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. దింతో భూముల విలువ అమాంతంగా పెరిగిపోయి, ఖాళీ స్థలాలు సైతం దొరకని పరిస్థితి ఎదురవుతోంది. కబ్జా దారులు పట్టణంలోని ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములే కాకుండా పట్టాదారు, లే అవుట్ ప్లాట్లపైన కన్ను పడుతోంది. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ పెద్దలు, సంబంధితశాఖల అధికారులే యథేచ్ఛగా కబ్జాదారులకు అండగా ఉంటున్నారంటూ విమర్శలకు తావిస్తోంది. ఏది ఏమైనా కుంటలో అక్రమ నిర్మాణాల ద్వారా వర్షాకాలంలో కుంటలోకి వెళ్లే నీరంతా చుట్టుపక్కల కాలనీల ఇళ్లలోకి వెళ్లి ముంపునకు గురైయ్యే ప్రమాదం ఉంది. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంటను సర్వే చేసి ఎఫ్.టి.ఎల్ మరియు బఫర్ జోన్ హద్దులు నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే అక్రమ నిర్మాణాలకు అనుమతులు రద్దు చేస్తూ వారిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# లింగమంతులు జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

## - కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



సూర్యాపేట డిసెంబర్ 28(వుదయం) లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి లింగమంతుల స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ 2025 సంవత్సరం ఫిబ్రవరి నెలలో జరిగే లింగమంతల స్వామి జాతర కు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 2వ తారీఖున దిష్టి పూజ నిర్వహిస్తారని, ఫిబ్రవరి 16 నుండి 20వ తేదీ వరకు జాతర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జాతర జరిగే అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. జాతరలో పనిచేసే సిబ్బంది అందరికీ పాసులు ఉండాలని వాలంటీర్స్ కు పోలీస్ అప్రూవల్ కార్డ్స్ ఉండాలని తెలిపారు. దేవాలయం వద్ద ప్రోటోకాల్ కొరకు అధికారిని నియమించినట్లు తెలిపారు. రెవిన్యూ పోలీస్ అధికారులు సమన్వయంతో పార్కింగ్ ప్రదేశాలు ఎగ్జిబిషన్ భోజన ప్రదేశాలను గూగుల్ స్కెచ్ తయారుచేసి అందించాలని అన్నారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలక్కుండా పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏ సులోచన, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఐదో వార్డ్ కౌన్సిలర్ భాష, డి.ఎస్.పి రవి, ఈవో కుశలయ్య, ఆలయ పూజారులు శ్రీశైలం శ్రీను తాసిల్దార్ కృష్ణయ్య ఆర్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల డిసెంబర్18(వుదయం ప్రతినిధి): సి. ఎం. కప్ -2024 పోటీలలో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేసేదిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజ్ వీరు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సి.ఎం. కప్ -2024 పోటీలను జిల్లాలో విజయవంతం చేసేదిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని, జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 27వ తేదీ నుండి జనవరి 2, 2025 వరకు రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలలో జిల్లా క్రీడాకారులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్య, ఉపాధి రంగాలలో క్రీడలకు ప్రత్యేక కోటా కేటాయించడం జరిగిందని, క్రీడలతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు విద్య, ఉపాధిలో రాణించేందుకు ఏకాగ్రత పెంపొందుతుందని, జీవితంలో ఎంచుకున్న ఉన్నత స్థానానికి ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని ఉషోదయ ఉన్నత పాఠశాలలో ఖోఖో, రెజ్లింగ్, బేస్‌బాల్, చెస్, సెవన్‌హిల్స్ పాఠశాలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలు, 20వ తేదీన కరాటే, జూడో, హ్యాండ్‌బాల్, ఉషూ, 21వ తేదీన హైటెక్ సిటీ క్లబ్‌లో బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, హత్యపతియా, టేబుల్ టెన్నిస్ ఇతర క్రీడాంశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలిలి ? పారునంది జలపతి



మానకొండూరు (వుదయం ప్రతినిధి): ఏబిసిడి వర్గీకరణ కోసం ప్రత్యేక పర్యటన చేస్తూన్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమిమ్ అక్తర్, రిటైర్డ్ జస్టిస్ గారిని కలిసి ఏబిసిడి వర్గీకరణ చేయాలని వినతి పత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు పారునంది జలపతి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర వ్యాప్తంగా అంటే రాష్ట్రము యూనిట్ గా వెంటనే అమలు చేయాలి అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో 59 కులాలు ఉండగా జనాభా ప్రకారం రిజర్వేషన్లలో ఎవరి వాటా వారికి చెందే విధంగా వెంటనే ఏబిసిడి వర్గీకరణ చేసి అట్టి కులాలకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు కోయాడ మురళి,సముద్రాల మల్లేష్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట తాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి.



యాదాద్రి భువనగిరి/రాజాపేట, డిసెంబర్ 18 వుదయం ప్రతినిధి రాజపేట తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన తాసిల్దార్ దామోదర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. సంబంధించిన సైట్ సమస్య ఉన్న విషయాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఎంపీడీవో కార్యాలయంలోని హాజరు రిజిస్టర్ లను తెప్పించుకున్న అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. తాసిల్దార్ దామోదర్ నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర రెడ్డి, ఇతర కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

# దుప్పట్లు, క్రీడా సామాగ్రి అందజేత



పెద్దవంగర, డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి):మండలంలోని రామచంద్రు తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ ఆర్థిక సహాయంతో, ఎంఈవో బుధారపు శ్రీనివాస్, చిట్యాల కాంప్లెక్స్ హెచ్ఎం అర్రోజు విజయ్ కుమార్ చేతుల మీదుగా వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు క్రీడా సామాగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. వృద్ధులు ఇబ్బందులు పడకుండా తన వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేయడం హర్షణీయమని కొనియాడారు. గత కొంత కాలంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ప్రధానోపాధ్యాయుడు సతీష్ ను అభినందించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీపీటీఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య, పాఠశాల ఉపాధ్యాయురాలు శోభా రాణి, పంచాయతీ కార్యదర్శి తహేర, కారోబార్ సుమన్, అంగన్వాడీ టీచర్ మమత, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య...



పాపన్నపేట డిసెంబర్18(వుదయం ప్రతినిధి): మతిస్థిమితం లేక ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా నది ఒడ్డున బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా బిలాల్ పూర్ గ్రామానికి చెందిన బలుపాటి ఆనంద్ (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.గత కొన్నిరోజులుగా మతిస్థిమితం కోల్పోయాడు.ఈనెల 15న ఇంట్లో నుండి బయటకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా నది ఒడ్డున చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఉండటాన్ని అటుగా వెళ్లిన స్థానికులు గమనించారు.పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆనవాళ్లను ఆధారంగా మృతి చెందినది ఆనంద్ గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులున్నారు. మృతుడి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# సాయి మందిరంలో అన్నప్రసన్న మహోత్సవం...



కోదాడ రూరల్ డిసెంబర్ 18(వుదయం) మండల పరిధిలోని నల్లబండగూడెం పరిధిలోని సాయి మందిరంలో రెడ్లకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లెల ప్రసాద్ మనవడు ప్రణీత్ అన్న ప్రసన్న మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయి సిద్ధార్థ శ్రావ్య దంపతుల కుమారుడు ప్రణీత్ తో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజలు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెడ్లకుట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు పాల్గొనీ చిరంజీవిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, తాత దొడ్డ సైదయ్య,భవాని,అర్చకుడు సాయి శర్మ, గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

నర్సాపూర్, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): మెదక్ జిల్లా మున్సిపాలిటీలోని దాయర వీధిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ చేస్తున్న సర్వే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇండ్లులేని నిరుపేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందన్నారు.

# షిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు.

- మూడున్నర లక్షల విలువైన వస్త్రాలు, బ్యాగులు, ఆర్థిక సాయం అందజేత.
- క్రీస్తు చూపిన ప్రేమ అందరికీ పంచాలి: మోజెస్ ములక.



బూర్గంపహాడ్ డిసెంబర్ 18 (వుదయం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- హైదరాబాద్ కు చెందిన షిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సారపాక సీయోను ప్రేయర్ హౌస్ మందిరంలో బుధవారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు భక్తి ప్రవక్తలతో నిర్వహించారు. షిలోహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మోజెస్ ములక ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం, కరకగూడెం, పినపాక, ఆంధ్రాలోని ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, అల్లూరు సీతారామరాజు జిల్లా ఏటపాక, విఆర్.పురం, కూనవరం, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు.. ఒరిస్సా రాష్ట్రంలోని మద్యపాక రాజుపేట లకు చెందిన 150 మంది పాస్టర్లకు క్రిస్మస్ పండుగ సందర్భంగా రూ.3.5 లక్షల విలువ గలిగిన నూతన వస్త్రాలు, బ్యాగులు, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రార్థన కూడికల్లో షిలోహు మిషనరీ వ్యవస్థాపకులు పాస్టర్ మోజెస్ ములక మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమను ప్రజలందరికీ పంచాలని ఆయన అన్నారు. అదేవిధంగా జనగామ కు చెందిన అగాపే ఇంటర్ ఫెయిత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ కేఎం జాన్, జయమణి జాన్ లు ఈ ప్రాంత సేవకులకు వస్త్రాలను పంపిణీ చేశారు. హైదరాబాద్ కు చెందిన బ్రదర్ జోనా బ్యాగులను అందజేశారు. ఈ క్రమంలో ప్రత్యేక గీతాలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనల అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ ప్రార్థన సమావేశానికి స్థానిక సంఘ కాపరి పాస్టర్ డి. పెద్దారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో షిలోహు మినిస్ట్రీస్ బృందం పాస్టర్ సైమన్, పాస్టర్ రాజీవ్, మోతుకూరి చరణ్... బ్రదర్ స్టీవ్ ఏలియట్ ములక, బ్రదర్ ప్రవీణ్... బ్రదర్ ఇమ్మానుయేల్.. ఆయా మండలాల కో-ఆర్డినే టర్లు డి. పెద్దారావు, యాకోబు, టిఎమ్. కుమార్, పాల్, జోన తాన్, తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే పబ్లిక్ టాయిలెట్స్.



పరకాల డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలో ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయానికి ఎదురుగా అమర దామం ప్రక్కన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి కుతవేటు దూరంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేసి గత రెండు సంవత్సరాలు గడిచినప్పటికీని ఏ రోజు పబ్లిక్ టాయిలెట్స్ ని తెరిసింది లేదు. పరకాల మరియు పరిసర గ్రామాల ప్రజలు వాటిని వాడుకున్నది లేదు. పబ్లిక్ టాయిలెట్ అని బోర్డు పెట్టి ఆ గేట్లకు అనునిత్యం తాళాలు వేసి ఉండడం చేత పబ్లిక్ గత్యంతరం లేక పబ్లిక్ గానే ఆ పరిసర ప్రాంతాలలో బహిరంగ మూత్ర విసర్జన చేయడం కారణంగా అమరధామం కి వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతూ ఆ దుర్వాసనకి ఆ పరిసరాలలోకి వెళ్లి కూర్చొని సేద తీరాలన్నా ఇబ్బందిగా ఉందంటూ వాపోతున్నారు. ఈ పరిస్థితులను అర్థం చేసుకొని సంబంధిత మున్సిపల్ అధికారులు ఆ పబ్లిక్ టాయిలెట్ ను ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి ఉంచాలని. ఆదుర్గంధం నుండి ప్రజలను కాపాడాలని కోరుచున్నారు.

# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త
## .ఎస్సై క్రాంతి కిరణ్



పెద్దవంగర, డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి): సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కాంతి కిరణ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక ఎస్సై, ఏఎస్సై అని పేరు చెప్పి, తమ ఇంట్లో వారికి ఆరోగ్యం బాగోలేదని చెప్పి, డబ్బులు ఫోన్ పే చేయమని సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సాధారణంగా ఉన్నతాధికారి నుంచి గానీ, ముఖ్యమైన నాయకుడి నుంచి గానీ సందేశాలు వస్తే.. అధికారులు, సిబ్బంది, నాయకులు శిరసావహిస్తారు. దీనిని ఆసరాగా చేసుకుని, నేరగాళ్లు నయా మోసాలకు పాల్పడుతున్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, పిల్లల ప్రవర్తనలో ఏమైనా మార్పులు ఉన్నాయా, ఇంటికి ఏమైనా ఆన్లైన్ ద్వారా పార్సల్స్ వస్తున్నాయా ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు.

# డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణంతో నిరుపేదల కల సాకారం..
## ఎమ్మెల్యే సంజయ్ కుమార్





జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 18 ( వుదయం ):జగిత్యాల నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో జగిత్యాల పట్టణ 36వ వార్డు కి చెందిన చేట్పల్లి కిషన్ విమల దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ రాధిక దంపతులు,మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై శుభా కాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూదశాబ్దన్నర క్రితం అర్బన్ హౌసింగ్ కాలని ఏర్పాటు చేయటం జరిగింది .గత ప్రభుత్వం లో 4520 ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది.%వీ ఎవి%కాంగ్రెస్ ప్రభుత్వం లో డబల్ బెడ్ రూం ఇండ్ల పాత బకాయిలు,మౌలిక సదుపాయాలు డ్రైనేజీ లు,సెప్టిక్ ట్యాంక్ ,కరెంటు,నీటి వసతుల కోసం దాదాపు 66 కొట్ల నిదులు మంజూరు చేయటం జరిగింది. గతం ప్రభుత్వం లో కేటాయించిన డబల్ బెడ్ రూం ఇండ్ల ను ఏ నియోజకవర్గం లో కూడా నిర్మించలేదు .జగిత్యాల లో మాత్రమే 4520 ఇం త్వరలోనే డబల్ బెడ్ రూం ఇండ్ల మౌలిక సదుపాయాలు కల్పన పనులు పూర్తి చేసి,లబ్ధిదారుల అందరికీ అందించే విధంగా ప్రయత్నం చేస్తా అని అన్నారు ఎమ్మెల్యే.ఆహ్వానించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు ఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి , ఏ ఈ శరన్, నాయకులు ప్రభాత్ సింగ్ ఠాగూర్ ,శ్రీరామ్ బిక్షపతి ,పోతూనుక మహేష్,రంగు మహేష్ ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ములుగు, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటిడిఏ పరిధిలోని గిరిజన యువత ఉద్యోగాలు సాధించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ సంస్థ(టాస్క్) ఆధ్వర్యంలో 10 రోజులు ఉచిత శిక్షణ తరగతులుంటాయని ఏటూరునాగారం ఐటిడిఏ పీఓ చిత్రమిశ్రా తెలిపారు. నిరుద్యోగ యువతకు అవసరమైన నైపుణ్యాలతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు తమ విద్యార్హత జిరాక్సులతో ఈనెల 21న ఐటిడిఏలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దేవరకద్ర, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకల్ మండలం జాతీయ రహదారి-44 రహదారి పక్కన కాటవరం గ్రామశివారులో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుని వయసు 35-40 సంవత్సరాలు ఉంటుందని అడ్డాకుల పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. శరీరంపై షర్టు లేదని, బూడిద రంగు నైట్ పాయింట్ ధరించి ఉన్నాడన్నారు. చనిపోయి మూడు, నాలుగు రోజులు కావచ్చు అని పేర్కొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి



పెద్దవంగర, డిసెంబర్ 18 (వుదయం ప్రతినిధి): మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి ప్రత్యేక పూజ నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన దేశ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయని అన్నారు. మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతన ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల ఇంచార్జి విజయ్ పాల్ రెడ్డి, సీనియర్ నాయకులు జాటోత్ నెహ్రు నాయక్, జిల్లా కార్యదర్శి ముత్యాల పూర్ణచందర్, జనగామ జిల్లా యూత్ అధ్యక్షుడు క్రాంతి కుమార్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్ నాయక్, మండల యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సతీష్, బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సీతారాం నాయక్, మాజీ ఎంపీపీ బానోత్ వెంకన్న నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుడకంటి యాకయ్య, జాటోత్ వెంకన్న, రాంబాబు, రాంచరణ్ ముఖ్యనాయకులు, అయ్యప్ప స్వాముల, భక్తులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఆకస్మికంగా తనిఖీ
## జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్





జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 18( వుదయం ):తేదీ 18 డిసెంబర్ 2024 జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆకస్మికంగా మెట్టుపల్లి మండలంలోని చౌలమద్ది గ్రామంలో గల ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. సందర్శనలో భాగంగా ప్రాథమిక పశువైద్య కేంద్రంలో జరుగుతున్న పశువైద్య సేవలు గురించి ఆరా తీయడం జరిగింది. అలాగే పశువైద్య కేంద్రంలో రిజిస్టర్ లను తనిఖీ చేస్తూ పశు వైద్య ఆరోగ్య కేంద్రంలో ఉన్న అన్ని వసతుల గురించి పరిశీలించడం జరిగింది ముఖ్యంగా వ్యాక్సిన్ స్టోరేజ్ మందుల యొక్క స్టోరేజ్ ని సందర్శించడం జరిగింది. మందుల యొక్క వివరాలు తెలుసుకోవడం జరిగింది. ప్రస్తుతం శాఖా పరంగా జరుగుతున్న అఖిలభారత పశు గణన మండలంలో ఏ విధంగా సాగుతుందో తెలుసుకొని ఆన్లైన్లో దాని పరిశీలించడం జరిగింది పశువులను ప్రతి గ్రామంలో కచ్చితంగా పశు గణన చేయాలని చెబుతూ దాన్ని త్వరితగతంగా పూర్తి చేయుటకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. తర్వాత వ్యాక్సినేషన్ ప్రోగ్రాం కింద చేపట్టిన పలు టీకాల వివరాలను రిజిస్టర్ లో మాత్రమే కాకుండా ఆన్లైన్లో నమోదు గురించి వెరిఫై చేయడం జరిగింది తదనంతరం పశు వైద్య సేవలు మరింత పెంచాలని కృత్రిమ గర్భోత్పత్తి ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేలు జాతి అభివృద్ధి జరిగేటట్లు చూడాలని ఆదేశించడం జరిగింది. తదనంతరం జిల్లా కలెక్టర్ గారు కోరుట్ల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని సందర్శించి ప్రాథమిక పశువైద్య కేంద్రం మొదటి అంతస్తులో ఉండడంవల్ల పశుపోషకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పూర్తి ఏర్పాట్లు చేయాలని మండల తాహసిల్దార్ మరియు పట్టణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించడం జరిగింది. అలాగే కోరుట్ల మండల పశువైద్యాధికారిని కూడా తాసిల్దార్ తో కలిసి కోరుట్ల పట్టణంలో తాత్కాలిక నిర్వహణకు అనువైన ప్రభుత్వ భవనాన్ని ఏర్పాటు చేయమని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ ఎల్ మనోహర్, సహాయ సంచాలకులు డాక్టర్ బి నరేష్, పశువైద్య కేంద్ర పశువైద్యాధికారి డాక్టర్ మనీషా, డాక్టర్ సంతోష్ మరియు పశు వైద్య సిబ్బంది, మెట్పల్లి ఆర్డీవో శ్రీ శ్రీనివాస్ , కోరుట్ల ఆర్డిఓ జీవాకర్, సంబంధిత తహసిల్దారులు, ఎంపీడీవోలు మరియు తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



దమ్మపేట డిసెంబర్18(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు దమ్మపేట మండల కేంద్రంలో లక్ష రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్ లను లబ్దిదారుల ఇండ్లకు వెళ్లి అందజేయడం జరిగింది..ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు, మండల కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, యువజన నాయకులు చామర్తి గోపిశాస్త్రి, కేక్కిరాల రమేష్ , మాజీ సర్పంచ్ ఆగోతు బాలాజీ, ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు రొయ్యల కుమార్, పగడాల కృష్ణారావు, చక్రాల మల్లేశ్వరరావు, పసుమర్తి చిన్నబాబు, సేవాదళ్ సభ్యులు గట్ల సర్వేశ్వరరావు, మళ్ళా చిన్న తదితరు నాయకులు పాల్గొన్నారు..

# నేడు కోదాడ లో జరగనున్న జిల్లా సైన్స్ సదస్సు



కోదాడ టౌన్ డిసెంబర్ 18(వుదయం) సూర్యాపేట జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పట్టణం లోని సీ సీ రెడ్డి పాఠశాలలో నేడు రేపు ఎల్లుండి వరకు నిర్వహించనున్నారు.దీనికి సంబంధించిన ఏర్పాట్లను, జిల్లా సైన్స్ అధికారి ( డి ఎస్ ఓ) %వా%. దేవరాజు , కోదాడ మండల విద్యాధికారి ఎండి. సలీం షరీఫ్ పరిశీలించారు. 19 ఉదయం 9 గంటల 30 నిమిషాలకు వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం ప్రారంభమవుతుందని,

మధ్యాహ్నం 1గంట నుండి కోకరికుల మ్ కార్యక్రమాల పోటీలు వ్యాసరచన, డిబేటింగ్ ,క్విజ్ నిర్వహించబడునని తెలిపారు.

# ప్రమాదకరమైన అల్ఫోజోలం పట్టివేత

దుబ్బాక, డిసెంబర్18(వుదయం ప్రతినిధి): సిద్దిపేట నుంచి కిష్టాపూర్ కు తరలిస్తున్న అల్ఫోజోలంను పట్టుకున్నామని సిద్దిపేట ఎక్సైజ్ ఎస్హెచ్ వో శ్రీనివాస్, డీటీఎఫ్ సీఐ తెలిపారు. వారి వివరాల ప్రకారం మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని పలు ప్రాంతాలకు అల్ఫోజోలం అక్రమంగా తరలించారనే సమాచారం మేరకు సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా రెండు రోజుల వ్యవధిలో సుమారు రూ. 40 లక్షల విలువ చేసే అల్ఫోజోలంను పట్టుకున్నామని వారు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి అదనపు కలెక్టర్..
## అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం

యాదాద్రి భువన గిరి/రాజపేట,డిసెంబర్18 వుదయం ప్రతినిధి:ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎలాంటి తప్పులకు తావు లేకుండా వేగవంతంగా నిర్వహించాలని జిల్లా (రెవెన్యూ) అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం రాజపేట మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో దరఖాస్తు ఆధారంగా సర్వే సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వే ను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ప్రత్యేక మొబైల్ యాప్ లో నమోదుచేస్తున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా లబ్ధిదారుల వివరాలు సేకరిస్తూ ఆన్లైన్లో సజావుగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.ఇందిరమ్మ పథకం కింద పూర్తిస్థాయి అర్హతగల నిరుపేద కుటుంబాలకు ఇళ్లను అందజేసే లక్ష్యంతో సర్వే చేయాలని తెలిపారు. ఇక్కడైనా అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇచ్చిన సమాచారం ప్రకారంఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు తాసిల్దార్ ఆఫీస్ తనిఖీ చేయగా సమయానికి తహసిల్దార్ అందుబాటులో లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొని హాజరు రిజిస్టర్ ని తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి భూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట తహసిల్దార్ దామోదర్,ఎంపీడీవో నాగవేణి,ఎంపీఓ ఆవుల కిషన్,రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ ఫెస్టివల్ లో పాల్గొనే విద్యార్థులకు తపస్ ఆర్థిక సాయం




పాపన్నపేట డిసెంబర్18(వుదయం ప్రతినిధి): మధ్యప్రదేశ్ లోని బోపాల్ లో జరగనున్న నేషనల్ బాల రంగ్ ఫెస్టివల్ ప్రోగ్రాం కు హాజరవుతున్న పాపన్నపేట విద్యార్థులకు విద్యావేత్త మామిడి సుధాకర్ రెడ్డి తమవంతు సహాయంగా పదివేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ చెక్కును తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం పాపన్నపేట మండల శాఖ అధ్యక్షుడు మంగ నర్సింలు

చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ కు బుధవారం అందజేశారు. ఈనెల 21, 22 తేదీలలో పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలంగాణ తరఫున పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, జిల్లా బాధ్యులు ప్రసాద్ రెడ్డి,వడ్ల ప్రవీణ్, ఉపాధ్యాయులు అంజాగౌడ్ ,ప్రవీణ్ ,కృష్ణ కాంత్ , ఇందిర, కవిత తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందజేత





కాసిపేట డిసెంబర్ 18 (వుదయం విలేకరి) పీ ఎం టి ఏ యూనియన్ పిలుపు మేరకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల సాధనకై, 010 పద్దు ద్వారా తమకు వేతనాలు అందజేయాలని కోరుతూ తహసిల్దార్ భోజన్న కు ఎంఈఓ ఎంపీడీవో కార్యాలయల లో వినతి పత్రం అందజేసిన మండల కేంద్రం లోని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు '010 ' పద్దు సాధనకై, పి.ఎం.టి.ఏ తలపెట్టిన నిరసన కార్యక్రమాలలో, భాగంగా 5 వ రోజు కార్యాచరణ. లో అధికారులకు వినతి పత్రం అందజేయడం జరిగిందని ఆర్థిక శాఖలో 010 కి సంబంధించిన ఫైల్ పెండింగ్ లో ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి, జి ఓ విడుదల చేసి తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిచో యూనియన్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగిస్తామని తెలియజేశారు

# క్రీడలు




# సానియా మీర్జా

## రెండో పెళ్లికి కూడా గ్రీన్ సిగ్నల్



సానియా మీర్జా, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ప్రేమించుకొని వివాహం చేసుకున్నప్పటికీ 14 ఏళ్ల బంధానికి ఇద్దరు కూడా ఇటీవలే ఫుల్ స్టాప్ పెట్టారు.. దీంతో షోయబ్ మాత్రం సానియా మిర్జా నుంచి విడిపోయిన వెంటనే గ్యాప్ తీసుకోకుండా మరొక వివాహం చేసుకున్నారు.. అయితే సానియా మీర్జా మాత్రం ఇప్పటివరకు రెండో వివాహం గురించి ఎక్కడ ప్రస్తావించలేదు చేసుకోలేదు. తన కుమారుడితో కలిసి మాత్రమే జీవిస్తూ ఉన్నది. పెళ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు సన్నిహితులు సైతం ఒత్తిడి తెస్తూ ఉన్న ఇప్పటివరకు అలాంటి అవకాశాన్ని తీసుకోలేదు సానియా మీర్జా. అయితే ఇలాంటి సమయంలోనే ఇండియన్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ రెండో వివాహం చేసుకోబోతున్నారని విధంగా ప్రచారం సాగింది. అయితే ఇదంతా కూడా ఫేక్ రూమర్స్ అంటే సానియా మీర్జా తండ్రి ఖండించారు.. ఇక సానియా మీర్జా కూడా ప్రస్తుతం ఒంటరిగా ఉండకూడదని కుటుంబ సభ్యులు భావించడమే కాకుండా పాకిస్తాన్ నటుడు నాబిల్ జాఫర్ కూడా ఈమెను మరొక వివాహం చేసుకోమని సలహా ఇచ్చారు. అయితే సానియా మీర్జా మాత్రం పెళ్లి అంటే తనకు చాలా విరక్తి కలిగిందని చెప్పినట్లు సమాచారం. ఇటీవలే సానియాకు ఒక ఇంటర్వ్యూలో జాఫర్ హితబోధ చేసినట్లుగా సమాచారం. విడాకులు తీసుకున్నంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదు.. అజ్ఞానంతో చాలామంది మంచి భవిష్యత్తును కోల్పోతూ ఉంటారు.. అలా ఆలోచించడం తప్పు అంటూ తెలిపారు విడాకులు అనేది ఒక దురదృష్టకరమని ఎవరి జీవితంలోనైనా ఇలాంటి చీకటి రోజు ఉండకూడదంటూ తెలియజేశారు. దీంతో తాజాగా సానియా మీర్జా కూడా ఒక కొత్త జీవితం ప్రారంభించాలి అంటూ ఒక పోస్ట్ ని షేర్ చేసింది.. దీంతో ఒక్కసారిగా ఆమె అభిమానులు సానియా మనసు మారినట్టు ఉంది రెండో వివాహానికి సిద్ధమయ్యింది అన్నట్లుగా అందుకే ఇలా హింట్ ఇచ్చింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి కొంతమంది ఈసారైనా ఆచితూచి అడుగు వెయ్యండి అంటూ సలహా ఇస్తున్నారు. ఒకవేళ రెండో పెళ్లి అయితే వరుడు గురించి ముందుగానే హింట్ ఇస్తుందేమో చూడాలి.మరి ఏంటన్నది తెలియాలి.

# డ్రాగా ముగిసిన గబ్బా టెస్ట్




భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు డ్రా అయింది. ఐదో రోజు వర్షం కారణంగా పెద్దగా ఆట జరగకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. సిరీస్ 1-1తో సమంగా మారింది. ఇక నాలుగో టెస్ట్ మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరుగుతుంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన గబ్బా టెస్టు డ్రా అయింది. ఐదో రోజు వర్షం కారణంగా పెద్దగా ఆట జరగకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రతిస్పందనగా టీమ్ ఇండియా వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్రిస్బేన్‌లో భారీ వర్షం కురవగా, ప్రతికూల వాతావరణం కారణంగా మ్యాచ్ డ్రా అయింది. ప్రస్తుతం టెస్టు సిరీస్ 1-1తో సమంగా ఇరుజట్లు నిలిచాయి. తదుపరి మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరగనుంది. మొత్తం మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆధిపత్యం ప్రదర్శించినా నాలుగో, చివరి రోజు మాత్రం టీమిండియా అద్భుత ఆటతీరును ప్రదర్శించిందనడంలో సందేహం లేదు. ఆస్ట్రేలియా టీమిండియాకు కేవలం 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గత పర్యటనలో ఆస్ట్రేలియాపై ఇదే మైదానంలో 328 పరుగుల స్కోరును ఛేదించిన టీమిండియా రికార్డు సృష్టించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి కూడా ఈ స్కోరును ఛేదించడం సాధ్యమనిపించింది. అయితే, వర్షం ఆస్ట్రేలియాను కాపాడినట్లు అంతా భావిస్తున్నారు. ఎందుకంటే గబ్బా మైదానంలో టీమిండియాకు అనుకూలమైన చరిత్ర ఉంది. గబ్బా టెస్టులో భారత జట్టు తరపున జస్ప్రీత్ బుమ్రా అద్భుత ప్రదర్శన చేశాడు. అతను మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతని పేరిట 9 వికెట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియా తరపున, ట్రావిస్ హెడ్ మొదటి ఇన్నింగ్స్‌లో 152 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. హెడ్ ?తర్వాత స్టీవ్ స్మిత్ తొలి ఇన్నింగ్స్‌లో 101 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు.

# ట్రావిస్ హెడ్

## తల పొగరుదించిన ఆకాష్ దీప్

టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్ కూడా బ్యాటింగ్‌లో తన ప్రతిభను కనబరిచి భారత్‌కు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, అతను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు, ఒక ఫన్నీ సంఘటన చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో టీమ్ ఇండియా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆకాశ్‌దీప్ చేసిన పని వ్యాఖ్యాతలను కూడా నవ్వించేలా చేసింది. బ్యాటింగ్ చేస్తున్న భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్.. పక్కనే ఉన్న ట్రావిస్ హెడ్‌కి బంతి ఇవ్వకుండా మైదానంలో పడేశాడు. దీనికి ట్రావిస్ హెడ్ కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత, ఆకాష్ అలెక్స్ కారీకి సారీ చెప్పడం కనిపించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు ఐదో రోజు తొలి సెషన్‌లో ఈ దృశ్యం కనిపించింది. టీమిండియా తొమ్మిది వికెట్లు కోల్పోయింది. జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్‌దీప్ చివరి వికెట్‌గా క్రీజులో ఉన్నారు. ఆకాష్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఓ బంతిని ఆడడం మిస్ అయ్యాడు. ఆ బంతి బ్యాట్‌కు తగిలి ప్యాడ్‌లో ఇరుక్కుపోయింది. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న హెడ్ ఆకాష్ బంతిని తీసుకోవడానికి వచ్చాడు. ఆకాష్ ప్యాడ్ నుంచి బంతిని తీసివేస్తున్న సమయంలో.. ఆపై హెడ్ బంతిని అడిగాడు. కానీ, బంతిని హెడ్‌కి ఇవ్వకుండా, ఆకాష్ దానిని నేలపై విసిరాడు. ఆ తర్వాత, హెడ్ అతని వైపు చూస్తూ, బంతిని స్వయంగా తీయడం ప్రారంభించాడు. అప్పుడు ఆకాష్ వికెట్ కీపర్ అలెక్స్ కారీకి 'ఐ యామ్ సారీ' అని చెప్పుకొచ్చాడు. ఈ ఫన్నీ సంఘటన చూసి వ్యాఖ్యాతలు కూడా నవ్వడం మొదలుపెట్టారు. ఆ తర్వాత హెడ్ కూడా నవ్వుతూ కనిపించాడు. ఈ ఫన్నీ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా లైక్ అవుతోంది. అనంతరం ఆకాశ్‌దీప్ వికెట్‌ను ట్రావిస్ హెడ్ తీయడం గమనార్హం. 213 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయిన టీమ్ ఇండియా చివరి వికెట్‌కు అవసరమైన పరుగులను జోడిస్తోంది. క్రీజులో బుమ్రా, ఆకాష్ మధ్య మంచి భాగస్వామ్యం నెలకొని ఉంది. వీరిద్దరూ చివరి వికెట్‌కు 47 పరుగులు జోడించారు. కంగారూ జట్టు ప్రధాన బౌలర్లు బుమ్రా, ఆకాష్‌ల వికెట్లను తీయలేకపోయారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ బంతిని ట్రావిస్ హెడ్‌కి అప్పగించాడు. అతను తన రెండో ఓవర్ ఐదో బంతికి ఆకాష్‌ను అవుట్ చేసి భారత్‌ను 260 పరుగులకు తగ్గించాడు. ఆకాశ్ 44 బంతుల్లో 31 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు.

# రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా స్టార్ స్పిన్నర్..



ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ గబ్బా టెస్టు ముగిసిన వెంటనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల అశ్విన్ తన అంతర్జాతీయ కెరీర్‌లో 765 వికెట్లు పడగొట్టాడు. అలాగే, టెస్టు క్రికెట్‌లో 6 సెంచరీల సాయంతో 3503 పరుగులు చేశాడు. భారత ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గబ్బా టెస్టు ముగిసిన వెంటనే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పటి వరకు భారత టెస్టు చరిత్రలో అత్యంత విజయవంతమైన బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్ ఒకడిగా పేరుగాంచాడు. ఈ టూర్‌లో అతనికి ఇప్పటి వరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. అడిలైడ్ తర్వాత, అతను గబ్బా టెస్టుకు దూరమయ్యాడు. గబ్బా టెస్టు సందర్భంగా అశ్విన్ టీమిండియా ఆటగాళ్లను కౌగిలించుకుంటూ కనిపించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని కౌగిలించుకున్నాడు. అశ్విన్ కూడా హెడ్ కోచ్ గంభీర్‌తో చాలాసేపు మాట్లాడి, ఆపై విలేకరుల సమావేశానికి వచ్చి రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చాడు. అశ్విన్ టెస్టు క్రికెట్‌లో 106 మ్యాచ్‌లు ఆడి 537 వికెట్లు తీశాడు. అతను తన పేరిట 37 ఐదు వికెట్లు సాధించాడు. మ్యాచ్‌లో 8 సార్లు 10 వికెట్లు తీసుకున్నాడు. అశ్విన్ వన్డేల్లో 156 వికెట్లు కూడా తీశాడు. టీ20లో అశ్విన్ 72 వికెట్లు తీశాడు. అతను తన అంతర్జాతీయ కెరీర్‌లో 765 వికెట్లు సాధించాడు. బ్యాట్స్‌మెన్‌గానూ అశ్విన్ తనదైన ముద్ర వేశాడు. టెస్ట్ క్రికెట్‌లో 3503 పరుగులు చేశాడు. అతను మొత్తం 6 టెస్ట్ సెంచరీలు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొత్తం 8 సెంచరీలు చేశాడు. ఆర్ అశ్విన్ తన కెరీర్‌లో ఎన్నో పెద్ద మైలురాళ్లను సాధించాడు. రికార్డులతో పాటు 2011లో వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో భాగస్వామ్యం అయ్యాడు. అలాగే, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు ఆసియా కప్‌ను కూడా అశ్విన్ గెలుచుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులను కూడా అశ్విన్ గెలుచుకున్నాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు డ్రాగా ముగిసింది. బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో చివరి రోజైన బుధవారం కేవలం 25 ఓవర్లు మాత్రమే వేయగలిగారు. ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే వర్షం కారణంగా ఒక రోజు ఆట రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో టీమిండియా స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు.

# టీమిండియా కొత్త జెర్సీ




ఇండియన్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జయ్ షా, మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కలిసి, శుక్రవారం, నవంబర్ 29న భారత మహిళల క్రికెట్ జట్టుకు కొత్త వన్డే జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగింది. డిసెంబర్ 5 నుంచి ఆస్ట్రేలియాలో జరగనున్న మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు ఈ జెర్సీని ఆవిష్కరించారు. భారత మహిళా క్రికెట్ జట్టుకు కొత్త జెర్సీ, కొత్త లుక్ తెచ్చిపెట్టిందని ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయిందని అంటున్నారు. ఈ కొత్త జెర్సీలో భుజాలపై మూడు రంగుల తివర్ణ పతాకం ఉండటం ప్రత్యేకత. ముందు జెర్సీలో మూడు తెల్లటి చారలు మాత్రమే ఉండేవి. డిసెంబర్ 22 నుంచి 27 వరకు వడోదరలో జరగనున్న వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డే మ్యాచ్‌లలో భారత మహిళా జట్టు తొలిసారిగా ఈ కొత్త జెర్సీని ధరించనుంది. జెర్సీ ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడిన జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, "ఈ జెర్సీని ఆవిష్కరించడం చాలా గర్వంగా ఉంది. వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో మేమే తొలిసారిగా దీన్ని ధరించడం చాలా ఆనందంగా ఉంది. ఈ జెర్సీ డిజైన్ నాకు చాలా నచ్చింది. ముఖ్యంగా భుజాలపై ఉన్న త్రివర్ణ పతాక రంగులు చాలా అందంగా ఉన్నాయి. ఇది చాలా ప్రత్యేకమైన వన్డే జెర్సీ" అని అన్నారు. మహిళా క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో ఆడే మ్యాచ్‌లకు ముందు ఆస్ట్రేలియాలో మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి వెస్టిండీస్‌తో మూడు టీ20లు, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. 2023 నుంచి అడిడాస్ భారత క్రికెట్ జట్టుకు కిట్ స్పాన్సర్‌గా ఉంది.

అప్పటి నుంచి జట్టు తరచూ తమ జెర్సీలను మార్చుకుంటూ వస్తోంది. గత ఏడాది పురుషుల వన్డే ప్రపంచ కప్‌కు, ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్‌కు ప్రత్యేక జెర్సీలను తీసుకొచ్చారు. అంతేకాకుండా, బ్లూ కలర్ కాలర్‌తో కూడిన తెల్లటి పోలో షర్టు వంటి భారత జట్టు ప్రాక్టీస్ కిట్‌లు కూడా చాలా ప్రాచుర్యం పొందాయి. నవంబర్ 28న, పురుషుల జట్టు ఆస్ట్రేలియా పార్లమెంట్ హౌస్‌కు వెళ్లినప్పుడు ఈ తెల్లటి పోలో షర్టు ధరించారు. అక్కడ వారిని ప్రధానమంత్రి ఆంథోని అల్బనీస్ ఆహ్వానించారు.

# జాతీయం - అంతర్జాతీయం

## పార్లమెంట్ ఆవరణలో ఇండియా బ్లాక్ నిరసన



న్యూఢిల్లీ : కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హెూం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు ఆశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని అన్నారు.

"నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు , పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి" ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు.

## మాస్కోలో పేలుడు




### రష్యా ఉన్నత స్థాయి సైనిక జనరల్ సహా ఇద్దరు మృతి

మాస్కో : రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో అత్యంత సీనియర్ మిలటరీ నేత, రష్యా ఆర్మీకి చెందిన రసాయన ఆయుధాల విభాగాధిపతి ఇగర్ కిరిలొవ్ మరణించారు. ఈ బాంబు దాడి జరిపింది తామేనని ఉక్రెయిన్ ప్రకటించింది. ఆగేయ మాస్కోలో ఒక అపార్ట్‌మెంట్ భవనం వెలుపల నిలిపి వుంచిన స్కూటర్‌లో పేలుడు పదార్థం పెట్టారు. దాన్ని పేల్చివేయడంతో ఇగర్ కిరిలొవ్ ఆయన అసిస్టెంట్ చనిపోయారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లో రష్యా బలగాలు విజయం సాధించాయని అధ్యక్షుడు పుతిన్ చెప్పుకున్న మరుసటి రోజే రాజధానిలోని నివాస ప్రాంతంలో ఈ దాడి జరగడం గమనార్హం. రష్యా సైన్యంలో రసాయన, జీవ, రేడియోలాజికల్ ఆయుధాల విభాగానికి కిరిలొవ్ (54) నేతృత్వం వహిస్తున్నారు. కిరిలొవ్‌ను యుద్ధ నేరస్తుడిగా ప్రకటిస్తూ స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగానే ఈ పేలుడు జరిపినట్లు ఉక్రెయిన్‌కి చెందిన ఎస్‌బియు సెక్యూరిటీ సర్వీస్ వర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి ఆ భవనంలోని పలు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ముందు తలుపు దారుణంగా దెబ్బతింది. ఈ దాడిని తీవ్రవాద చర్యగా రష్యా అధికారులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. యుద్ధ రంగంలో నిషేధించిన రసాయన ఆయుధాలను ఉక్రెయిన్‌పై వినియోగించారని, ఆ రకంగా కిరిలొవ్ యుద్ధ నేరస్తుడని ఉక్రెయిన్ చెబుతోంది. యుద్ధ నేరాలకు ప్రతీకారం తప్పదని ఆ వర్గాలు హెచ్చరించాయి.

## కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

న్యూఢిల్లీ : పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలన్న సిఫార్సును తన నివేదికలో కమిటీ చేర్చిందని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది. 'దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని పేర్కొంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది' అని లోక్‌సభ సచివాలయం ఆ ప్రకటనలో వివరించింది.

## రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఇక ఎన్‌టిఎ నిర్వహించదు



న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం నుండి ఇక ఎటువంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించబోదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నత విద్యకు సంబంధించిన ప్రవేశ పరీక్షలపై మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తుందని స్పష్టం చేశారు. మెడికల్ ఎంట్రెన్స్ నీట్ పరీక్షా పత్రం లీక్, అలాగే మరి కొన్ని ప్రశ్నాపత్రాల లీక్‌లతో పలు పరీక్షలు రద్దయిన వైనం పెద్దయెత్తున విమర్శలకు దారి తీసింది. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు పరీక్షల సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. సాంప్రదాయపద్ధతిలో పెన్ను, పేపర్‌తో నిర్వహించాలా? లేక కంప్యూటర్‌తో పరీక్ష నిర్వహించాలా? అనే విషయమై ఆరోగ్య మంత్రిత్వశాఖతో విద్యా శాఖ చర్చలు జరుపుతోంది. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) %-% యుజి ని ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సమీప భవిష్యత్తులో కంప్యూటర్ సహాయంతో, సాంకేతిక ఆధారిత ప్రవేశపరీక్షలకు మారాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. కొత్త సంవత్సరంలో ఎన్‌టిఎను పునర్వ్యవస్థీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. కనీసం పది కొత్త పదవులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇంకా పనితీరులో కూడా చాలా మార్పులు వస్తాయన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేని రీతిలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

## జార్జియా రెస్టారెంట్‌లో 12 మంది భారతీయులు మృతి

గుడౌరి : జార్జియాలోని గుడౌరిలో ఒక రెస్టారెంట్‌లో 12 మంది భారతీయుల మృతదేహాలను కనుగొన్నారు. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మృతదేహాలపై లాంటి గాయాలు లేదా హింస జరిగిన ఆనవాళ్లు గుర్తించలేదని తెలిపింది. వీరంతా కార్బన్ మోనాక్సైడ్ పీల్చిన కారణంగా మరణించారని ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపింది. రెస్టారెంట్‌లోని రెండో అంతస్తులో ఉన్న బెడ్‌రూమ్‌ల్లో మృతదేహాలు ఉన్నాయని వెల్లడించింది. రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తరువాత బెడ్‌రూమ్‌లకు సమీపంలో ఉన్న పవర్ జెనరేటర్‌ను ఆన్ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపింది. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపింది. మృతి చెందిన 12 మంది భారతీయులేనని భారత రాయబార కార్యాలయం చెబుతుండగా, జార్జియా ప్రభుత్వం మాత్రం 11 మంది భారతీయులు, మరొకరు తమ దేశస్థుడని తెలిపింది. జార్జియాలోని గుడౌరి మంచు పర్వత క్రీడలకు ప్రసిద్ధి. వీటిని చూసేందుకు భారతీయులు ఎక్కువమంది అక్కడ పర్యటిస్తారు. అక్కడి రెస్టారెంట్లలోనూ భారతీయులు పని చేస్తుంటారు.

## అమెరికాలో మళ్లీ కాల్పుల మోత

అగ్రరాజ్యం అమెరికాలోని మళ్లీ కాల్పుల మోత మోగింది. విస్కాన్సిన్‌లోని మాడిసన్‌లో ఉన్న అబండంట్ క్రైస్తవ పాఠశాలలో కాల్పులు జరిగాయి. 12వ తరగతి విద్యార్థి ఈ ఘటనకు కారణమైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వారందరినీ స్థానిక ఆసుపత్రులకు తరలించారు. నిందితుడు సైతం మఅతుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందినవారు విద్యార్థులా లేదా సిబ్బందా అనే విషయం తెలియాల్సి ఉంది. కాల్పులు ఘటనకు సంబంధించి దేశాధ్యక్షుడు బైడెన్‌కు అధికారులు సమాచారం అందించారు. 400 విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో కాల్పుల ఘటనతో ఒక్కసారిగా భయాందోళనలు చోటుచేసుకున్నాయి. భారీ ఎత్తున పోలీసులు వాహనాలు, అంబులెన్స్‌లు, ఫైరింజన్లు పాఠశాలను మోహరించాయి. ఘటనపై మాడిసన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తాజా ఘటనతో అగ్రరాజ్యంలో తుపాకీ నియంత్రణ, పాఠశాలల భద్రత యూఎస్‌లో ప్రధాన రాజకీయ, సామాజిక సమస్యగా మారింది. ఇటీవల కాలంలో అమెరికాలోని పాఠశాలల్లో కాల్పులు ఘటనలు పెరుగుతున్నాయి. ఈ ఏడాదిలో మొత్తం 322 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నట్లు ఓ నివేదిక తెలిపింది.

## న్యూయార్క్ కోర్టులో ట్రంప్‌నకు ఎదురు దెబ్బ



న్యూయార్క్ : తనపై నమోదైన హుష్ మనీ కేసును కొట్టివేయాల్సిందిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ చేసిన విజ్ఞప్తిని మన్‌హటన్ న్యాయమూర్తి జువాన్ మర్చన్ తిరస్కరించారు. అధ్యక్షుడికి రక్షణ కల్పిస్తూ జులైలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని తనపై అభియోగాలను కొట్టేయాలని ట్రంప్ కోరారు. అధికారిక చర్యలకు సంబంధించే ఈ రక్షణ వుంటుంది తప్ప అనధికార వ్యవహార శైలికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రక్షణ వుండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పోర్న్ స్టార్‌కు డబ్బులు ఇవ్వడం(దీనినే హుష్ మనీ) కేసులో ట్రంప్ దోషి అని ఇప్పటికే కోర్టు తేల్చింది. ఆయనకు విధించాల్సిన శిక్షను ఖరారు చేయాల్సి వుంది. ఒకవేళ ఇదే గనుక జరిగితే శిక్ష అభియోగాలను ఎదుర్కొంటూ అధ్యక్షుడిగా శ్వేత సౌధంలో అడుగుపెట్టే తొలి అధ్యక్షుడు ట్రంప్ కానున్నారు. ఇదిలావుండగా, న్యాయమూర్తి మర్చన్ నిర్ణయాన్ని ట్రంప్ కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ విమర్శించారు. ఇది సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ఉల్లంఘించడమే కాగలదని తప్పుబట్టారు. ఈ కేసును తక్షణమే కొట్టేయాల్సి వుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## దక్షిణ కొరియా అధ్యక్షుడికి రెండోసారి సమన్లు




సియోల్ : ఈ నెల ఆరంభంలో దేశంలో సైనిక పాలన విధించడంపై జరుగుతున్న విచారణలో సాక్ష్యమిచ్చేందుకు రావాల్సిందిగా దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు ఆ దేశ ప్రాసిక్యూషన్ సర్వీస్ రెండోసారి సమన్లు జారీ చేసింది. ఈనెల 21లోగా హాజరు కాని పక్షంలో అరెస్టు వారెంటు జారీ చేసే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని హెచ్చరించింది. డిసెంబరు 3న చోటు చేసుకున్న సంఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది. ఈ బృందం సోమవారం అధ్యక్షుడికి సమన్లు జారీ చేసింది. గత ఆదివారం అధ్యక్షుడిని విచారించాల్సి వుంది, కానీ ఆయన హాజరు కాకపోవడంతో రెండోసారి సమన్లు పంపింది. యూన్ ఈ విచారణకు హాజరైనట్లైతే, అధికారంలో వుంటుండగా దర్యాప్తునకు సిద్ధమైన మొదటి దక్షిణ కొరియా అధ్యక్షుడవుతారు. ఒకవేళ అరెస్టు వారెంటు జారీ చేయాలని ప్రాసిక్యూషన్ నిర్ణయిస్తే, అరెస్టు కాబోయే ఆసియా దేశపు మొదటి సిట్టింగ్ అధ్యక్షుడవుతారు. యూన్‌ను శనివారం పార్లమెంట్ అభిశంసించింది. పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి)కి చెందిన 12మంది డిప్యూటీలు అనుకూలంగా ఓటు వేశారు. ప్రధాని హన్ డక్ సూ ప్రస్తుతం తాత్కాలిక అధ్యక్షుడిగా వున్నారు. రాజ్యాంగ కోర్టు నిర్ణయంపైనే ఆయన భవితవ్యం ఆధారపడి వుంది. దేశంలో మార్షల్ లా విధించడం ద్వారా అధ్యక్షుడు రాజ్యాంగాన్ని ఉల్లంఘించారా? లేదా? అని నిర్ణయించడానికి కోర్టుకు ఆరు మాసాల గడువు వుంది.

## 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్
### నత్తనడకన మణిపూర్ హింసాకాండ కేసుల విచారణ

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండకు సంబంధించిన కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. ఈ కేసుల దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు నియమించిన 42 ప్రత్యేక విచారణ బృందాలు (సిట్) కేవలం 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్ దాఖలు చేశాయి. హత్య, అత్యాచారం, మహిళలపై లైంగిక నేరాలు, దగ్ధం, దోపిడీ, ఇతర హేయమైన చర్యలతో మొత్తం 3,023 కేసులు నమోదు కాగా, వీటిలో 192 కేసుల్లోనే ఇప్పటి వరకూ ఛార్జిషీట్లు దాఖలు కావడం ఆందోళన కలిగిస్తోంది. కేసుల విచారణ ప్రారంభమైందా? లేదా? అనే విషయం కూడా స్పష్టంగా తెలియడం లేదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇద్దరు కుకీ జో మహిళలపై లైంగిక వేధింపులు, నగంగా ఊరేగించిన కేసు విచారణ ఇంకా ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2023 మే 4న ఈ ఘటన జరిగితే వీడియో వైరల్‌గా మారిన రెండు నెలల తరువాత రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత సిబిఐకి అప్పగించారు. ఈ కేసులో ఒక బాలుడుసహా ఆరుగురు నిందితులపై ఛార్జిషీట్ నమోదు చేసి గౌహతిలోని కోర్టులో గత ఏడాది జులైలో సిబిఐ దాఖలు చేసింది. అయినా ఇంకా విచారణ ప్రారంభం కాలేదు. గత ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులను రప్పించి ఈ సిట్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నవంబర్ 20 వరకూ 574 నిందితులపై ఛార్జిషీటు దాఖలు చేశాయి. 384 మందిని అరెస్టు చేశాయి. భద్రతా దళాల నుంచి దోచుకున్న 501 ఆయుధాలను, 13,464 మందుగుండు సామాగ్రిని సిట్‌లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ సిట్లను సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆరు గ్రూపులుగా విభజించారు. హత్యలు, తీవ్రమైన నేరాల కేసుల విచారణకు సంబంధించి ఒక గ్రూపును, మహిళలపై అత్యాచారాలు, వేధింపుల కేసుల విచారణకు ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. ఆస్థుల దగ్ధం, లూటీలు, ఇతర నేరాలకు మరో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేశారు.

## సలహాలు ఇస్తారు.. బాధ్యతలు విస్మరిస్తారు..!



న్యూఢిల్లీ: అందరికీ సలహాలిచ్చే ప్రధాని నరేంద్ర మోడీ తన బాధ్యతలను మాత్రం విస్మరిస్తున్నారని సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. రాజ్యాంగంపై రాజ్యసభలో మంగళవారం కూడా కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను ఏడాదిన్నరగా సందర్శించేందుకు ప్రధాని ఇప్పటికీ సిద్ధపడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంపై చర్చ వినడానికి కూడా ఆయన ఇష్టపడడం లేదు. అందుకే పార్లమెంటుకు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫెడరలిజం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని, బిజెపి అప్రజాస్వామికంగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని అన్నారు. మొత్తం 830 మంది ప్రజాప్రతినిధులు బిజెపిలోకి ఫిరాయించారన్నారు. దాంతో వారంతా 'పవిత్రులు' అయ్యారా అని ఎద్దేవా చేశారు. 95 ఏళ్ల విదేశీయుడు జార్జి సోరోస్‌పై బిజెపి వారం రోజులపాటు పార్లమెంట్‌ను అడ్డుకుందని, అయితే సోరోస్ డబ్బు ఎవరికి వస్తుంది? జెపిసి విచారణ జరిపితే ప్రధాని కార్యాలయం గుమ్మం వరకు చేరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. సోరోస్ సంస్థకు భారతదేశం నుండి డబ్బు వెళ్తోందని, దీన్ని బిజెపి ఆపగలదా? ఆపే ఆలోచన బిజెపికి ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. ఫెడరలిజాన్ని దెబ్బతీసే విధంగా బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు గవర్నర్‌గిరీని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్లు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనేది 'ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే ఆలోచన'కు పొడిగింపు అని విమర్శించారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉందని జాన్ బ్రిట్టాస్ ఎత్తిచూపారు.

## జమ్మూ కాశ్మీర్‌లో అగ్ని ప్రమాదం

కథువా: జమ్మూ కాశ్మీర్‌లోని కథువాలో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు వ్యక్తులు ఊపిరాడక మరణించారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు ఆసుపత్రి పాలయ్యారని వారు తెలిపారు. జిల్లాలోని శివ నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఉన్నవారు నిద్రిస్తున్న సమయంలో దట్టమైన పొగలు వ్యాపించాయి. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో స్థానికులు మంటలను గమనించి ఇంటికి చేరుకున్నారని అధికారులు తెలిపారు. బాధితులను కతువాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా, ఇద్దరు మైనర్‌లతో సహా ఆరుగురు మరణించినట్లు ప్రకటించారు. "పది మందిని ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆరుగురు చనిపోయారు, మరో నలుగురు గాయపడ్డారు" అని ఆసుపత్రిలోని సీనియర్ డాక్టర్ చెప్పారు. పొగ పీల్చడంతో ఊపిరాడక బాధితులు చనిపోయారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, కాలిన గాయాలు ఏవీ నివేదించలేదని డాక్టర్ తెలిపారు.

# చక్కని ఆరోగ్యం


## సబ్జాతో డయాబెటిస్ మాయం!



ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ భారిన పడిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. చిన్న పెద్ద అని తేడ లేకుండా ఈ డయాబెటిస్ అందరికి వచ్చేస్తుంది. డయాబెటిస్ వచ్చిన వారు ఆ వ్యాధి వల్ల చనిపోయే ప్రమాదం తక్కువ ఉన్నప్పటికీ గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంది. అయితే డయాబెటిస్ ని మాయం అవ్వాలంటే ఈ చిట్కాలు పాటించండి. డయాబెటిస్ ఉన్నవారు ఎక్కువ అన్నం ఎక్కువగా తినకూడదు.. కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి.. పండ్లు ఎక్కువగా తీసుకోవాలి..

ఇలా అన్ని రకాల సహజ కూరగాయలను ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారు. అయితే సబ్జా విత్తనాలు తీసుకోవటం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన లాభాలు ఉన్నాయి. సబ్జా విత్తనాల్లో విలువైన పోషకాలు ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ పోషకాలు రెట్టింపు మేలు చేస్తాయి. గ్లూకోజ్, ఇన్సులిన్ టాలరెన్స్‌ను పెంచుతాయి. సబ్జాతో ఉన్న ఉపయోగాలు ఏంటంటే.. శరీరంలో తలెత్తే పలు రకాల ఇన్‌ఫ్లమేషన్లను ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌తో అదుపు చేయవచ్చు. ఈ పోషకం సబ్జాలో ఉంటుంది. వంద గ్రాములు సబ్జా విత్తనాల్లో 17.8 గ్రాముల ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అంతేకాదు సబ్జా విత్తనాల్లో అధికంగా ఉండే పీచు కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఈ విత్తనాల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి. రక్తపోటు కలిగి ఉన్న డయాబెటిస్ వారు ప్రతి రోజూ క్రమం తప్పకుండా సబ్జా విత్తనాలు తింటే వారి సిస్టాలిక్ బ్లడ్ ప్రెషర్ తగ్గినట్టు పలు పరిశోధనల్లో తేలింది. రక్తపోటు తగ్గితే గుండె మీద పడే భారం కూడా తగ్గుతుంది. కాబట్టి సబ్జా విత్తనాలు తీసుకోవడం ద్వారా గుండె జబ్బులను అరికట్టవచ్చు. రోజంతా తరచుగా నీళ్లు తాగుతూ ఉండాలి. ఇలా చెయ్యడం వల్ల డయాబెటిస్ పూర్తిగా మాయం అవ్వకపోయిన తగ్గుతుంది అని పరిశోధకులు చెప్తున్నారు.

## గుడ్లు తింటే బరువు తగ్గుతారా?



ఉడికించిన కోడిగుడ్లు రోజువారీ ఆహారంలో క్రమం తప్పకుండా రెండు తీసుకుంటే బరువు తగ్గవచ్చు అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.ఒక క్రమ పద్ధతిలో ఉడికించిన కోడిగుడ్డు ను రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల రెండు వారాలకు 24 పౌండ్ల బరువును తగ్గించుకోవచ్చు. మన దేశంలో ఇప్పుడున్న ఆరోగ్య సమస్య ఊబకాయం. ఊబకాయం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం మరియు అనేక రకాల క్యాన్సర్ వంటి వ్యాధుల వచ్చే అవకాశం ఉంటుంది. చాలా మంది బరువు తగ్గడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తారు. క్యాలరీలను తగ్గించకుండా బరువు తగ్గడం అనేది దాదాపు అసాధ్యం. బరువును అదుపులో ఉంచడం కోసం చేసే ఆహార నియంత్రణ లో ముఖ్యమైనది శరీరానికి అవసరమైన పోషకాలను మాత్రమే అందించాలి.ఆరోగ్యకరమైన ఆహారం అంటే మీరు తాజా కూరగాయలు మరియు పండ్లు, ధాన్యాలు మరియు బీన్స్ తినాలి, కానీ కేలరీల తగ్గించడానికి, అధిక కేలరీల డెజర్ట్‌లు, ఫాస్ట్ ఫుడ్, ఫిజీ డ్రింక్స్ మరియు స్వీట్స్ తగ్గించండి. మన శరీరానికి శక్తి కోసం చాలా కేలరీలు అవసరమని మనందరికీ తెలుసు.కొంతకాలం పోషకాలను తీసుకోవడం తగ్గిస్తే, మన శరీరానికి హాని కలిగించవచ్చు, జీవక్రియను బలహీనపరుస్తుంది మరియు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ప్రమాదాన్ని పెంచుతుంది. గుడ్లు ప్రోటీన్ మరియు అనేక పోషకాలను కలిగి ఉన్నందున ఆరోగ్యకరమైన ఆహారం. గుడ్లు మన శరీరానికి అవసరమైన విటమిన్లు మరియు పోషకాలను అందిస్తాయి. గుడ్డు లో విటమిన్ బి 5 మరియు విటమిన్ బి 12 పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఫోలేట్, విటమిన్ ఇ, పొటాషియం, కాల్షియం, మాంగనీస్, జింక్ మరియు ఐరన్ వంటి ఖనిజాలు మరియు విటమిన్లు కూడా ఉన్నాయి. ఒక పెద్ద గుడ్డులో చిన్న మొత్తంలో కార్బోహైడ్రేట్లు, ఐదు గ్రాముల కొవ్వు, ఆరు గ్రాముల నాణ్యమైన ప్రోటీన్ మరియు 77 కేలరీలు ఉంటాయి.ఆరోగ్యాన్నిచ్చే పోషకాలన్నీ పచ్చసొనలో ఉంటాయి,తెల్ల సొన లో ప్రోటీన్ మాత్రమే దొరుకుతుంది.

## రోగనిరోధక శక్తి పెంచుకోండిలా..

కీలక సూచనలు చేసిన ఆయుష్ శాఖ...! ప్రపంచంలోని దేశాలను కరోనా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ లోను కరోనా తీవ్ర ప్రభావం చూపుతోంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి కరోనా సోకుతూ ఉండటంతో ఆయుష్ శాఖ రోగ నిరోధక శక్తి పెంచుకోవడానికి కీలక సూచనలు చేసింది. ఆయుష్ శాఖ ఎప్పుడు దాహం వేసినా వేడి నీటినే తాగాలని సూచించింది. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయాలని చెప్పింది. వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, పసుపు వంటకాల్లో తప్పక ఉండేలా చూసుకోవాలని సూచించింది. ఎండు ద్రాక్ష, శొంఠి, మిరియాలు, తులసితో చేసిన ఆయుర్వేద తేనీరును తాగాలని పేర్కొంది. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు పాలలో కలుపుకుని తాగాలని తెలిపింది. ఉదయం, సాయంత్రం కొబ్బరి నూనెను ముక్కు రంధ్రాల దగ్గర పట్టిస్తే మంచిదని



పేర్కొంది. రోజుకు రెండు నిమిషాల పాటు కొబ్బరి నూనెను పుక్కిలించి ఉమ్మివేయాలని.. గోరువెచ్చని నీటితో నాలుకను శుభ్రం చేసుకోవాలని పేర్కొంది. సోంపు గింజలు లేదా పుదీనా ఆకుల నీటి ఆవిరిని పొడిదగ్గు ఉన్నవారు రోజుకు ఒకసారి పీల్చుకోవాలని సూచించింది. బెల్లంతో లేదా తేనెతో లవంగాల పొడిని కలుపుకుని తాగితే మంచిదని తెలిపింది. దగ్గు ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

## సెల్ఫీ లేకుండా ఉండలేకున్నారా..

### ఇక జాగ్రత్త పడాల్సిందే..



ఎవరైనా ఉదయం లేవగానే రామా కృష్ణ అంటారు.. ఈ మధ్య కాలంలో ఉదయం లేవగానే సెల్ఫీలే.. ఉదయం లేవగానే ఇప్పుడు ఎక్కువ మంది చేసే పని సెల్ఫీ తీసుకోవడం.. చేసిన ప్రతి చిన్న పనికి క్లిక్ అనిపించడం ఇప్పటి రోజుల్లో కామన్ అయింది. అయితే ఇలా సెల్ఫీలు తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెప్తున్నారు.ఫోన్ ద్వారా రేడియేషన్ అనేది ముఖం మీద పడటం వల్ల చర్మ సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయట.మితిమీరిన ఫోన్ వాడకం మానసికస్థితిపైనా ప్రభావం చూపుతోందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఆత్మవిశ్వాసం మందగించడానికి, ఆందోళన పెరగడానికి సెల్ఫీలు కారణమవుతున్నాయని ఈస్థటిక్ క్లీనిక్స్ చేసిన ఒక అధ్యయనంలో వెల్లడించింది.అంతేకాదండోయి రోజులో మూడు సెల్ఫీలు తీసుకుంటున్నారా అయితే ప్రమాదానికి దగ్గరగా ఉన్నట్లేనని అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ (ఏపీఏ) అంటోంది.ఇలా వచ్చే ఆరోగ్య సమస్యన సెల్ఫీటస్ గా పేరు పెట్టేసింది. ఈ సెల్ఫీల వల్ల యాంగ్జైటీ డిజార్డర్లు వచ్చే అవకాశం ఉందంటున్నారు ఈస్థటిక్ క్లీనిక్స్ డైరెక్టర్లలో ఒకరైన డాక్టర్ దేబరాజ్‌షోమే. ఫోటోలు ఎక్కువగా తీసుకోవడం వల్ల మేము ఫోటోలో సరిగ్గా పడలేదు మొహాన్ని మార్చుకోవాలి అనే దృక్పదంతో ఉండిపోవడం వల్ల సర్జరీలు ఎక్కువగా జరుగుతున్నాయని డాక్టర్ దేబరాజ్‌షోమే వెల్లడించారు.ఫ్రంట్ ఫేస్ కెమెరాలను కూడా బ్యాన్ చేసి,ఫ్రంట్ కెమెరా లేని స్మార్ట్ ఫోన్లు సమాజాల్లోకి వస్తే ఇంకా బాగుంటుందేమో అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే .. పాటించాల్సిన మార్గాలు..1 . ఎక్కువ సమయం దగ్గర వాళ్లతో గడపడం,2 .ఒకరు ఏమనుకున్నారో కాకుండా మీగురించి ,మీరు ఆత్మ విశ్వాసం పెంచుకోవడం,3 . సెల్ఫీ తీసుకొని పోస్ట్ చేసే సమయాన్ని జీవితాన్ని సరిదిద్దుకొనే పనులపై ద్రుష్టి పెట్టడంఇలా చేయడం వల్ల సెల్ఫీ తీసుకోవాలనే ఆలోచన మారుతుందని,వాటివల్ల ఆత్మవిశ్వాసం పెరిగి మనుషుల మధ్య బంధాలు బలపడతాయని,ఇలా చేయడం వల్ల టైంకి తినడం ,పడుకోవడం చేస్తారు కనుక అనేక రోగాల నుండి బయటపడవచ్చునని అంటున్నారు.. సో సెల్ఫీ లవర్స్ బె కేర్ ఫుల్.. అందాన్ని పదిమందికి చూపించడం కన్నా ఆరోగ్యం ఇంపార్టెంట్..

## ఈ టైంలో కాఫీ తాగారంటే అది ఒంట్లో విషంగా మారుతుంది!



కాఫీ తాగందే చాలా మందికి రోజు ప్రారంభంకాదు. ఘుమఘుమలాడే కాఫీ నీళు కాసిన్ని గొంతు తడిపితే రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. అయితే కొందరు రోజుకు లెక్కకు మించి కాఫీని తాగేస్తుంటారు. ఇలా కాఫీ తాగడం శృతి మించితే ఆరోగ్యానికి అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్న వారు కాఫీ తాగారంటే.. చాలా మందికి ఉదయాన్నే తాగే ఒక కప్పు కాఫీతో రోజు ప్రారంభమవుతుంది. ఇలా మొదలైన కాఫీ.. రోజంతా పలు సందర్భాల్లో లాగించేస్తుంటారు. అలా రోజు గడిచే కొద్దీ 10 వరకైనా కాఫీ కప్పులు తాగేస్తారు. అయితే బ్రిటన్‌లో నిర్వహించిన ఓఅధ్యయనం ప్రకారం, మితంగా కాఫీ తాగడం వల్ల మరణ ప్రమాదాన్ని దాదాపు 10 సంవత్సరాల వరకు తగ్గించవచ్చని అంటున్నారు. ఇది మానసిక స్థితిని కూడా రిఫ్రెష్ చేస్తుంది. అయితే కాఫీతో ప్రయోజనాలు మాత్రమే కాదు, ప్రతికూలతలు కూడా ఉన్నాయి. అవేంటంటే.. ఆస్ట్రేలియన్ శాస్త్రవేత్తల ప్రకారం.. రోజుకు 6 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే అది నేరుగా మెదడును ప్రభావితం చేస్తుంది. దీని వల్ల డిమెన్షియా అంటే జ్ఞాపకశక్తి తగ్గిపోయే ప్రమాదం ఎక్కువ. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం కాఫీ అలసట నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అయితే ఈ 5 రకాల ఆరోగ్య సమస్యలున్న వారికి మాత్రం కాఫీ ప్రమాదకరం.

కాఫీలో కెఫీన్ ఉంటుంది. ఇది ఒత్తిడి లేదా నిద్ర సమస్యలతో బాధపడుతున్న రోగులకు హానికరం. కెఫిన్ నాడీ వ్యవస్థను సక్రియం చేస్తుంది. హృదయ స్పందన రేటును వేగవంతం చేస్తుంది. ఇది టెన్షన్‌కు కారణం కావచ్చు. పడుకునే ముందు కాఫీ తాగడం వల్ల నిద్రలేమి కలుగుతుంది.శరీరంలో ఐరన్ లోపిస్తే పొరపాటున కూడా కాఫీ తాగకూడదు. నిజానికి, కాఫీ ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తుంది. ముఖ్యంగా ఆహారంతో తీసుకున్నప్పుడు. కాఫీలో కనిపించే టానిన్ ఐరన్‌తో బంధిస్తుంది. శరీరం దాని శోషణను నిరోధిస్తుంది. ఇది శరీరంలో ఐరన్ లోపానికి కారణమవుతుంది. గర్భధారణ సమయంలో కాఫీకి దూరంగా ఉండటం మంచిది. వాస్తవానికి, ఈ సమయంలో కెఫీన్‌కు దూరంగా ఉండాలి. ఎందుకంటే ఇది శిశువు పెరుగుదల, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

గర్భధారణ సమయంలో కెఫిన్ అధికంగా తీసుకోవడం వల్ల ముందస్తు జననం, తక్కువ బరువుతో బిడ్డ పుట్టడం, గర్భస్రావం జరిగే ప్రమాదం ఉందని పరిశోధనలో తేలింది. గర్భిణీ స్త్రీలు రోజుకు 200mg కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. అంటే ఒక్క కప్పు కాఫీ మాత్రమే తాగాలి. కెఫీన్ రక్తపోటును గణనీయంగా పెంచుతుంది. ఎందుకంటే ఇది గుండె, రక్త నాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. ఎవరికైనా B P సమస్యలు ఉంటే, ఎక్కువ కాఫీ తాగడం వలన వారి ప్రమాదాన్ని పెంచుతుంది. ఎవరైనా యాసిడ్ రిఫ్లక్స్ లేదా గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధితో బాధపడుతుంటే, వారు కాఫీ తాగితే, వారి సమస్యలు మరింత పెరుగుతాయి. నిజానికి, కాఫీలోని కెఫిన్ కడుపులో యాసిడ్ ఉత్పత్తిని పెంచడం ద్వారా గుండెల్లో మంట రిఫ్లక్స్‌కు కారణమవుతుంది. ఇది వాపు, ఛాతీ నొప్పి వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది.



## చలికాలంలో ఉసిరి తీసుకుంటే

### ఏం జరుగుతుంది?

చలికాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు చాలా మంది ఉసిరి జ్యూస్ తాగుతుంటారు. కానీ ఈ సమస్యలున్నవారు మాత్రం ఉసిరి ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పొరబాటున తీసుకున్నారో మీ ఆరోగ్యం ప్రమాదంలో పడిపోతుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఈ కింది ఆరోగ్య సమస్యలు ఉన్న వారు. ఉసిరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా చలికాలంలో శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి చాలా మంది ఉసిరి జ్యూస్ తాగుతుంటారు. ఉసిరితో రకరకాల రోగాలు దూరమవుతాయని సాధారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. కానీ మీకు తెలుసా, ఉసిరి తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉసిరి అస్సలు తినకూడదు. ఇలాంటి వారికి ఉసిరి విషంతో సమానం. ఉసిరి అధికంగా తినడం వల్ల రక్తపోటు సాధారణం కంటే భారీగా తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే తక్కువగా ఉన్నవారు కూడా దీనికి దూరంగా ఉండాలి. అలాగే కడుపు సమస్యలు, గుండెల్లో మంట సమస్యలు ఉన్నవారు కూడా ఉసిరి జ్యూస్ తీసుకోకూడదు. ఉసిరికాయను ఎక్కువగా తీసుకోవడం వల్ల మలం గట్టిపడుతుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారు ఉసిరికి దూరంగా ఉండాలి. ఉసిరికి మూత్రవిసర్జన లక్షణాలు కలిగి ఉంటుంది. ఇది శరీరంలో ఎక్కువ మూత్రాన్ని విడుదల చేస్తుంది. కాబట్టి ఉసిరికాయను ఎక్కువగా తినడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. ఈ సమస్యలు లేనివారు చలికాలంలో ఉసిరి పరిమిత మోతాదులో తినవచ్చు. ఇది మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

# సినిమా



## వినోదాత్మక దర్శకుడితో చిరంజీవి సినిమా.. నవ్వులే నవ్వులు..

చిరంజీవి జోరు మీద సినిమాలు చేస్తున్నారు. యువ హీరోలతో సమానంగా వరుస సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన వసిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు. కొత్త ఏడాదిలో ఈ చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ ముగింపు దశలో ఉంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తారు. ఇటీవల 'దసరా చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఓ సినిమా ప్రకటించారు, దీని తర్వాత చిరు.. దర్శకుడు అనిల్ రావిపూడితో ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీన్ని షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి నిర్మించనున్నట్లు సమాచారం. అనిల్ గత చిత్రాలకు పూర్తి భిన్నమైన కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉండబోతోందని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా పట్టాలెక్కనున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారికి ప్రకటన వచ్చే అవకాశముంది. అనిల్ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెలతో సినిమా ప్రారంభమవుతుందని టాక్.



## నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం..

### ఇంట్రెస్టింగ్‌గా మోహన్ లాల్ బరోజ్ ట్రైలర్

మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే వీటిలో ఒకటి బరోజ్ మోహన్‌లాల్ స్వీయదర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ డిగామా బంగ్లాలోపల ఎవరికీ కనిపించని భూతం ఉందంటూ ఓ చిన్నారి వాయిస్ ఓవర్‌తో మొదలైంది ట్రైలర్. వందల సంవత్సరాలుగా నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం. మిగితా వారి కోసం కార్చే కన్నీరు కంటే మహత్తరమైన నిధి ఈ లోకంలో మరేది లేదంటున్నాడు బరోజ్. నిధుల తోటకు కాపాలా ఉండే బరోజ్ కథ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. మోహన్‌లాల్ స్వీయదర్శకత్వంలో వస్తోన్న చిత్రం కనకపు సింహాసనంపై రాజసం ఉట్టిపడేలా కనిపిస్తూ.. సినిమాపై హైప్ పెంచేస్తున్నాడు. కథనందిస్తున్న ఈ మూవీని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరంబవూరు తెరకెక్కిస్తున్నారు. మోహన్ లాల్ మరోవైపు నందకిశోర్ దర్శకత్వంలో పాన్ ఇండియా మూవీ వృషభ లో కూడా నటిస్తున్నాడు. తెలుగు, మలయాళ బైలింగ్యువల్ చిత్రంగా వస్తోన్న ఈ చిత్రంలో టాలీవుడ్ నటుడు రోషన్ మేక కీలక పాత్రలో నటిస్తున్నాడు. అదేవిధంగా కన్నప్పతోపాటు %ఝఎ, ఝఎఝ్ఝఅ, ూ2: జుఎజూబత్ఝ్ఝఅ% మోహన్ లాల్ ఖాతాలో ఉన్నాయి.



## నితిన్ సినిమా వెనక్కి వెళ్లింది

నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాబిన్ హుడ్' మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు నిర్మాణసంస్థ ప్రకటించింది. అనుకోని పరిస్థితుల వల్ల సినిమాను వాయిదా వేయాల్సి వచ్చిందంటూ మైత్రీ మూవీస్ పోస్ట్ పెట్టింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. నితిన్– వెంకీ కుడుముల కలయికలో రానున్న రెండో చిత్రమిది. శ్రీలీల కథానాయిక. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల చిత్రబృందం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనూ షూటింగ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ దాదాపు పూర్తయిందని ఒక్క పాట మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కారణంగా సినిమా విడుదల ఆలస్యమైనట్లు సమాచారం. నితిన్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ మూవీగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన టీజర్, పాటలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి.



## విడుదల పార్ట్ 2 లెంగ్త్ రన్ టైంతో వెట్రిమారన్ టీంకు మరో ఛాలెంజ్?

కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్షన్‌లో విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2 ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. కాగా తాజాగా ఆసక్తికర చర్చ ఒకటి నెట్టింట జరుగుతోంది. సీక్వెల్ రన్ టైం 2 గంటల 52 నిమిషాలు (172 నిమిషాలు). అయితే ఫస్ట్ పార్ట్‌తో పోలిస్తే కేవలం ఈ రన్ టైం 2 నిమిషాలే ఎక్కువ. పార్ట్ 1 లో తెలుగు వెర్షన్ విషయానికొస్తే రిలీజ్ సమయంలో రన్ టైం టాక్ ఆఫ్ ది పాయింట్‌గా నిలిచింది. పార్ట్ 1 లో స్లో నరేషన్ ప్రేక్షకులను రెండు పార్ట్‌లుగా డివైడ్ చేసింది. బలమైన కథాంశం ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన రాబట్టుకుంది. ఇప్పుడిక ఇదే లైన్‌లో సీక్వెల్ కూడా వస్తుండటంతో మరి తెలుగు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. స్టోరీ టెల్లింగ్‌తో ఇంప్రెస్ చేసే వెట్రిమారన్ టీంకు రన్ టైం మాత్రం మరోసారి ఛాలెంజ్ కానుందంటూ ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. మరి కంటెంట్ బాగుంటే చాలు ప్రేక్షకులు వాటన్నింటిని వెనక్కినెట్టేస్తారని సీక్వెల్ నిరూపిస్తుందా..? లేదా అనేది సర్వత్రాఉత్కంఠ నెలకొంది.

# జేపీసీకి వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు




'ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లును జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపడానికి లోక్‌సభ అనుమతించింది. బిల్లును జేపీసీకి పంపడంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించగా అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 149 ఓట్లు వచ్చాయి. దాంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లైంది. పార్లమెంట్ నూతన భవనంలో తొలిసారి ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం ద్వారా ఓటింగ్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అనుమానం ఉన్న వాళు ఓటింగ్ స్లిప్‌లతో క్రాస్ చెక్ చేసుకునేందుకు స్పీకర్ అనుమతించారు. దేశంలో లోక్‌సభతోపాటే వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకేసారి ఎన్నికల నిర్వహించడం కోసం వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును తీసుకొచ్చారు.

ఇది 129వ రాజ్యాంగ సవరణ బిల్లు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఇవాళ ఉదయం వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై సంపూర్ణ అధ్యయనం కోసం జేపీసీ పంపాలని భావిస్తున్నట్లు ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. దాంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ అనుమతి లభించినట్లయ్యింది.

**సాధారణ మెజారిటీతో లోక్‌సభ అనుమతి**

ఒకే దేశం–ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించేందుకు రూపొందించిన బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వెళ్లింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం సభలో ప్రశేపెట్టింది. ఈ బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సభలో ప్రవేశపెట్టారు. విస్తృత సంప్రదింపులు జరిపేందుకు గానూ పార్లమెంటు ఉభయసభల ఉమ్మడి కమిటీకి ఈ బిల్లును సిఫారసు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మేఘ్వాల్ కోరారు. ఎంపీల సంఖ్య ఆధారంగా ఆయా పార్టీలకు ఈ కమిటీలో చోటు కల్పించనున్నారు. ఏ పార్టీ తరఫున ఎంతమంది సభ్యులు ఉంటారో స్పీకర్ సాయంత్రానికి ప్రకటించనున్నారు. అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీ నుంచి కమిటీ ఛైర్మన్ ఉండనున్నారు. కమిటీలో ఉండేందుకు ఎంపీల పేర్లను ఇవాళే ప్రతిపాదించాలని రాజకీయ పార్టీలను స్పీకర్ కోరనున్నారు. ప్రాథమికంగా ఈ కమిటీ కాలపరిమితి 90 రోజులు విధించనున్నారు. తర్వాత ఈ గడువును పొడిగించే అవకాశం ఉంది. కాగా, జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు 32 రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వగా, 15 పార్టీలు వ్యతిరేకించినట్టు ఇప్పటికే రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ప్రకటించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది.

**రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ**

అసలు జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. జమిలి ఎన్నికలకు అపాయింటెడ్ తేదీగా లోక్‌సభ తొలిసారి సమావేశమైన రోజును గుర్తించాలని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. ఈ లెక్కన ఈ లోక్‌సభ తొలి సమావేశం గత జూన్ 24న జరిగింది. అంటే లోక్‌సభ కాలపరిమితి తీరిపోయే నాటికి అంటే జూన్ 24, 2029లోపు జమిలి ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. దీన్ని విశ్లేషిస్తే, 2029లోనే జమిలి ఎన్నికలు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎన్డీయే కూటమిలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు కూడా జమిలి ఎన్నికలు 2029లోనే అంటూ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. అలాగే, తన పూర్తి పదవీకాలాన్ని వదులుకోవడానికి ప్రధాని మోదీ సిద్ధంగా లేరని, ఈ క్రమంలో 2029లోనే జమిలి ఎన్నికలు ఉండొచ్చని మరికొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, 2027లో, 2028లో కూడా జమిలి ఎన్నికల నిర్వహణను కొట్టిపారేయలేమని, బిల్లు చట్టంగా మారాక, ఇది అంత కష్టతరమైన పనేమీకాదని మరికొందరు వాదిస్తున్నారు. ఇదిలాఉండగా.. సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత సమావేశమయ్యే తొలి లోక్‌సభ సమావేశంలో జమిలి బిల్లును రాష్ట్రపతి నోటిఫై చేయాలని, ఆ రోజును అపాయింటెడ్ డేగా తీసుకొంటే.. ఆ తర్వాత ఐదేండ్లకు జమిలి ఎన్నికలు నిర్వహిస్తారన్న వాదనను కూడా కొందరు తెరమీదకు తీసుకొస్తున్నారు. ఇదేజరిగితే, జమిలి ఎన్నికలు 2034లోనే జరుగొచ్చని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు.

# వచ్చే ఏడాది బీజేపీకి కొత్త అధ్యక్షుడు..!

# ఎవరికి అవకాశం కల్పిస్తారో?

కొత్త ఏడాదిలో భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను మొదలు పెట్టినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఈ ఎంపిక ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా పూర్తి అవుతుందని పేర్కొన్నాయి.

పార్టీ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు సజావుగా సాగుతున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. సగానికి పైగా రాష్ట్ర యూనిట్లలో పోలింగ్ ప్రక్రియ జనవరి మధ్య నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరి చివరికి జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఉన్న విషయం తెలిసిందే. 2020లో ఆయన బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఇక ఇటీవలే కేంద్రంలో ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నడ్డాను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడితోపాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్నారు. ఇక పార్టీ చీఫ్ పదవీకాలం మూడు సంవత్సరాలే. దీంతో ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నడ్డా పదవీకాలాన్ని పొడిగించారు.



**బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు?**

మరోవైపు తదుపరి పార్టీ అధ్యక్షుడు ఎవరన్న దానిపై జోరుగా చర్చ నడుస్తున్నది. కేంద్ర మంత్రులుగా పనిచేస్తున్న వారిలోనే ఒకరికి జాతీయాధ్యక్షుడి బాధ్యతలు అప్పగిస్తారా..? లేక కొత్త వారిని తీసుకుంటారా..? అనే విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో రేసులో పలువురి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే పేరు రేసులో ప్రధానంగా వినిస్తున్నది. బీఎల్ సంతోష్ తర్వాత పార్టీ జనరల్ సెక్రటరీల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా తావ్డేకు పేరున్నది. అలాగే తెలంగాణకు చెందిన కే లక్ష్మణ్ కూడా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ ఓబీసీ మోర్చా చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉన్నది. రేసులో సునీల్ బన్సల్ పేరు కూడా వినిపిస్తున్నది. ఆయన తెలంగాణ, బెంగాల్, ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీ ఓం మాథుర్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. మరోవైపు, పార్టీ తొలి మహిళా అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ నియమితులయ్యే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్నాయి.

## ఢిల్లీలోని పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు..

## వారంలో నాలుగోసారి



దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు రావడం నిత్యకృత్యంగా మారింది. గత వారం రోజుల్లో ఏకంగా మూడుసార్లు ఢిల్లీ పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి బెదిరింపులు వచ్చాయి. మంగళవారం ఉదయం ఢిల్లీలోని కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్, నార్త్ వెస్ట్ ఢిల్లీలోని సరస్వతి విహార్‌లో గల ఓ పాఠశాలకు బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇ–మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆయా పాఠశాలల వద్దకు చేరుకొని విద్యార్థులను, సిబ్బందిని ఖాళీ చేయించారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలల ఆవరణలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పాఠశాలలకు నకిలీ బాంబు బెదిరింపులు రావటం వారంలో ఇది నాలుగోసారి. గత శుక్రవారం ఏకంగా 40 పాఠశాలలకు, శనివారం మరో ఆరు పాఠశాలలకు, అంతకు ముందు నగరంలోని పలు పాఠశాలలు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో తాను చదువుకుంటున్న స్కూల్‌కు ఈ–మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు పంపినందుకు ఓ విద్యార్థిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించి, అతడి తల్లిదండ్రులను హెచ్చరించారు. వరుస బెదిరింపులతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బాంబు బెదిరింపులపై ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ ఇటీవలే స్పందించారు. నగరంలో నెలకొన్న శాంతిభద్రతలపై ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని, ఢిల్లీ నేరాలకు రాజధానిగా మారిందని విమర్శించారు.

## నిన్న పాలస్తీనా.. నేడు బంగ్లాదేశ్ బ్యాగ్..

## వినూత్న రీతిలో ప్రియాంక గాంధీ నిరసన




పార్లమెంట్‌కు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పలు అంశాలపై వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. నిన్న 'పాలస్తీనా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు హాజరైన ప్రియాంక.. ఇవాళ 'బంగ్లాదేశ్' బ్యాగ్‌తో దర్శనమిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 'బంగ్లాదేశ్ మైనారిటీల పక్షాన నిలవండి' అంటూ రాసి ఉన్న బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు సైతం ఇదే బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు.

**పాలస్తీనా బ్యాగ్‌తో ప్రియాంక గాంధీ..**

ప్రియాంక గాంధీ నిన్న పాలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో పార్లమెంట్‌కు హాజరయ్యారు. పాలస్తీనా సంఘీభావానికి చిహ్నంగా భావించే పుచ్చకాయ, శాంతి చిహ్నాలు వంటివి ఆ బ్యాగ్‌పై ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి పాలస్తీనాలోని గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలకు వ్యతిరేకంగా ప్రియాంక గాంధీ గళమెత్తారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో 'జాతి హత్య'లకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీరును కూడా ఆమె నిందించారు. గత వారం ఢిల్లీలోని పాలస్తీనా రాయబార కార్యాలయం ఛార్జ్ డి అఫైర్స్ అబేద్ ఎల్రాజెగ్ అబు జాజర్‌ను కూడా ఆమె కలిశారు.

## ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో రాహుల్‌గాంధీ భేటీ



లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఈ నెల 19న తమ పార్టీ ఎంపీలతో భేటీ కానున్నారు. పార్లమెంట్ హౌస్ అన్నెక్సేలో ఈ భేటీ జరగనుంది. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, రైతులకు కనీస మద్దతు ధర, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై పార్లమెంటులో అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. గౌతమ్ అదానీ అంశం, రైతులకు కనీస మద్దతు ధర తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సభలు వాయిదాపడుతూ వచ్చాయి. చివరకు ఈ నెల 13, 14 తేదీల్లో లోక్‌సభలో, ఈ నెల 16, 17 తేదీల్లో రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిగింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో రాజ్యాంగంపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఉభయసభల్లో వాడీవేడి చర్చ జరిగింది. రాజ్యాంగాన్ని దేశ పరిస్థితులకు అనుకూలంగా మార్చకుండా కాంగ్రెస్ పాలకులు వందలకొద్ది సవరణలు చేస్తూ వచ్చారని ప్రభుత్వం విమర్శించింది. దేశంలో కోసం ఇంతవరకు ఏమీ చేయని బీజేపీ మాకు రాజ్యాంగం గురించి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ క్రమంలో ఈ నెల 19న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ఎంపీలతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యాంగంపై చర్చ జరిగిన రెండు రోజులు మినహా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఇంతవరకు ఉభయసభలు సజావుగా సాగలేదు. ఇకముందైనా సభాకార్యకలాపాలు సజావుగా సాగుతాయా లేదా..? అనేది అనుమానంగా ఉన్నది.

## సావర్కర్‌ను కాంగ్రెస్ విమర్శించవద్దు



వీర సావర్కర్ కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే డిమాండ్ చేశారు. సావర్కర్ కు బీజేపీ భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ అంశాన్ని బీజేపీ పరిశీలించకపోతే సావర్కర్ గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేనట్టేనని చెప్పారు. అలాగే, సావర్కర్‌ను విమర్శించడాన్ని కాంగ్రెస్ మానుకోవాలని... ఇదే సమయంలో నెహ్రూని విమర్శించడాన్ని బీజేపీ మానుకోవాలని థాకరే సూచించారు. సావర్కర్, నెహ్రూ ఇద్దరూ అప్పటి కాలానికి తగిన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రధాని మోదీ కూడా పదేపదే నెహ్రూ పేరును లేవనెత్తడాన్ని మానుకోవాలని తెలిపారు.

## అమెరికాలో టిక్ టాక్ బ్యాన్

**న్యూయార్క్ :** అమెరికాలో టిక్‌టాక్ కష్టాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఇది ఇప్పటికే నిషేధితం అయ్యే ముప్పును ఎదుర్కొంటోంది. ఇప్పుడు అమెరికన్ చట్టసభ సభ్యులు ఈ యాప్‌ను వారి సంబంధిత యాప్ స్టోర్ల నుండి తీసివేయవలసిందిగా యాపిల్, గూగుల్‌లను ఆదేశించారు. అంటే గూగుల్ ప్లేస్టోర్ నుంచి, యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను తీసేయాలన్న మాట. ఇందుకోసం రెండు కంపెనీలకు జనవరి 19వ తేదీ వరకు సమయం ఇచ్చారు. ఇదే జరిగితే అమెరికాలోని ప్రజలు ఇకపై అఫీషియల్ సోర్స్‌ల నుంచి టిక్‌టాక నుంచి డౌన్‌లోడ్ చేయలేరు. అయితే ఈ నిర్ణయం ప్రస్తుత వినియోగదారులపై పెద్దగా ప్రభావం చూపదు.చైనా కంపెనీ బైట్‌డాన్స్ యాజమాన్యంలో టిక్‌టాక్ ఉంది. ఇప్పుడు బైట్‌డ్యాన్స్ అమెరికాలో తన కార్యకలాపాలను కొనసాగించాలనుకుంటే టిక్‌టాక్‌ను విక్రయించాల్సి ఉంటుంది. జనవరి 19వ తేదీలోగా టిక్‌టాక్‌ను వేరే దేశానికి చెందిన కంపెనీకి విక్రయించకపోతే దాన్ని నిషేధించే ప్రమాదం ఉంది. టిక్‌టాక్‌ని పౌరుల భద్రతకు ముప్పుగా అమెరికా పరిగణిస్తోంది. బైట్‌డ్యాన్స్ తన యాప్ ద్వారా ప్రజల వ్యక్తిగత డేటాను దొంగిలించి చైనా ప్రభుత్వానికి ఇచ్చిందని ఆరోపించింది.యూఎస్ పార్లమెంట్ కమిటీలోని ఇద్దరు సభ్యులు జాన్ ముల్నర్, భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తి యాపిల్ సీఈవో టిమ్ కుక్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌లకు లేఖ రాశారు. ఇందులో బైట్‌డ్యాన్స్‌కు కావాల్సిన చర్యలు తీసుకునేందుకు తగిన సమయం ఇచ్చామని తెలిపారు. ఇప్పుడు అది చట్టాన్ని అనుసరించకపోతే అమెరికాలో అలాంటి యాప్‌లను యాక్సెస్ చేయడానికి, నిర్వహించడానికి, అప్‌డేట్ చేసే హక్కు దానికి ఉండదు. అందువల్ల చట్టాన్ని గౌరవిస్తూ గూగుల్, యాపిల్ అవసరమైన చర్యలు తీసుకోవాలి.అమెరికా కోర్టు ఆదేశాల తర్వాత అమెరికా చట్టసభ సభ్యులు రాసిన ఈ లేఖ వెలుగులోకి వచ్చింది. ఈ నిర్ణయాన్ని బైట్‌డ్యాన్స్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇక్కడి నుంచి ఉపశమనం పొందవచ్చని బైట్‌డ్యాన్స్ భావిస్తోంది. ఇక్కడి నుంచి కంపెనీకి ఉపశమనం లభించకపోతే అమెరికాలో వ్యాపారం చేయడం కష్టంగా మారుతుంది. అయితే ఇప్పటికే ఉన్న వినియోగదారులు యాప్‌ని ఉపయోగించడం కొనసాగించగలరు. కానీ వారికి ఎలాంటి అప్‌డేట్‌లు లేదా సపోర్ట్ లభించదు.

## ఇండోనేషియా రక్షణమంత్రితో భారత నేవీ చీఫ్ భేటీ.. ఏం చర్చించారంటే..!



ఇండోనేషియా పర్యటనలో ఉన్న భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి ఆ దేశ రక్షణ మంత్రి, లెఫ్టినెంట్ జనరల్ జాఫ్రీ జంషుద్దీన్‌తో భేటీ అయ్యారు. భారత్–ఇండోనేషియా రక్షణ సంబంధాలకు ఈ భేటీని కీలక ముందడుగుగా చెప్పవచ్చు. భారత్–ఇండోనేషియా మధ్య రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశంలో చర్చించారు. రక్షణ పరిశ్రమలో రెండు దేశాల నడుమ పరస్పర సహకారాన్ని విస్తరించడంపై కూడా ఈ సమావేశంలో చర్చి జరిగింది. భారత నేవీ అధికార ప్రతినిధి ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.

## పీకే పార్టీకి గట్టి దెబ్బ.. కోర్ కమిటీకి మాజీ ఎంపీలు గుడ్‌బై

పాట్నా: వచ్చే ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'జన్ సురాజ్' వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ కు గట్టి దెబ్బ తగిలింది. 125 మంది సభ్యుల జన్ సురాజ్ కోర్ కమిటీకి మాజీ ఎంపీలు దేవేంద్ర ప్రసాద్, మునజిర్ హసన్ మంగళవారంనాడు రాజీనామా చేశారు. ప్రశాంత్ కిషోర్ పనితీరుపై ఈ ఇద్దరు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, కోర్ కమిటీ నుంచి తాము తప్పుకున్నప్పటికీ ఇంకా పార్టీకి వీడలేదని వారు వివరణ ఇచ్చారు. బీహార్ రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తాననే నినాదంతో గత అక్టోబర్ 2వ తేదీన 'జన్ సురాజ్' పార్టీని ప్రశాంత్ కిషోర్ ప్రారంభించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి మనోజ్ భారతిని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చిలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగేంతవరకూ ఆయన ఈ పదవిలో ఉంటారని తెలిపారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.